జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి
సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి | గురువారం 5 ఫిబ్రవరి 2026 | సంపుటి : 1 | సంచిక : 37 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## మన ఆహార, వ్యవసాయ రంగాలకు పూర్తి రక్షణ

- అమెరికాతో ఒప్పందం పట్ల ఆందోళన అక్కర్లేదు
- పార్లమెంట్‌లో మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి
- మన దేశ ప్రయోజనాల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం రాజీ పడబోదు



## సభలో రచ్చరచ్చ

- ఆగని విపక్షాల ఆందోళన
- అమెరికాతో ఒప్పందం, నరవణే పుస్తకంపై సమాధానం చెప్పాలని డిమాండ్
- ప్రధాని మోదీ స్థానాన్ని చుట్టుముట్టిన ప్రతిపక్ష సభ్యులు
- పరిస్థితి అదుపులో లేకపోవడంతో సభకు గైర్హాజరైన మోదీ

## మణిపూర్ సీఎంగా ఖేమ్‌చంద్ ప్రమాణం



5

## వడ్డించే వాడు.. అడిగే వాడు..

# మనోడై ఉండాలి


'ప్రజాపాలన ప్రగతి బాట' బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



- అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలి
- మిర్యాలగూడ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- ప్రభుత్వ కార్యక్రమాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలి
- పథకాల ద్వారా లబ్ధి పొందిన వారంతా అధికార పార్టీకి ఓటేయాలి
- బీజేపీ, బీఆర్ఎస్‌ల డిపాజిట్లు గల్లంతు కావాలి

నల్లగొండ

ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందాలంటే రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే మున్సిపాలిటీల్లో రూ.17,472 కోట్లు ఖర్చు పెట్టామని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామంలో ఏర్పాటు చేసిన 'ప్రజాపాలన ప్రగతి బాట' బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 'మున్సిపల్ శాఖ నా వద్దే ఉంది. మున్సిపాలిటీల అభివృద్ధి నా బాధ్యత. వడ్డించే వాడు మనవాడు. అడిగే వాడు కూడా మనోడై ఉండాలి. ఎమ్మెల్యేలు, మంత్రుల వద్దకు వెళ్లే వారినే గెలిపించాలి. ఇంకా 8 ఏళ్లు అధికారంలో ఉంటాం. మున్సిపాలిటీలను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటాం. గత ప్రభుత్వం పేదలకు కనీసం రేషన్ కార్డులు ఇవ్వలేదు. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చాం. దేశంలో ఎక్కడాలేని విధంగా 3.17 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం. గతంలో కేసీఆర్ వరి వేస్తే ఉరేసుకోవాలని, ధాన్యం తీసుకోమని చెప్పారు. మా ప్రభుత్వం వచ్చాక సన్న వడ్లు పండించాలని చెప్పాం. రూ.500 బోనస్ కూడా ఇస్తున్నాం. వ్యవసాయానికి 24 గంటల కరెంట్‌తో పాటు 54 లక్షల మందికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇస్తున్నాం' అని సీఎం చెప్పారు. 'రాష్ట్రంలో 25.35 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్లతో రుణమాఫీ చేసి అప్పుల నుంచి విముక్తి కల్పించాం. రైతు భరోసా కింద ప్రతి ఎకరాకు రూ.6 వేలు ఇస్తున్నాం. గతంలో 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు ఇచ్చాం. ఈ మున్సిపల్ ఎన్నికలు ముగియగానే మరో రూ.9 వేల కోట్లు ఇస్తాం. రాష్ట్రంలో రూ.20 వేల కోట్లతో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు - మిగతా2లో



## బాధ్యత దులిపేసుకున్న మోదీ

- చైనాతో ఘర్షణ సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించలేదు
- అప్పటి ఆర్మీ చీఫ్‌పైకి నెట్టేశారు
- చైనా ట్యాంకులు మీదకు వస్తున్నా సంబంధం లేదన్నట్లుగా మాట్లాడారు
- నరవణే పుస్తకంలో ఏముందో యువత తెలుసుకోవాలి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ వెల్లడి

5

## రేవంత్‌వి ఓటు బ్యాంకు

# రాజకీయాలు

- సనాతన ధర్మంపై దాడులు పెరుగుతున్నా చోద్యం చూస్తున్న ప్రభుత్వం
- పురపాలిక ఎన్నికల్లో భాజపా అభ్యర్థుల గెలుపు తెలంగాణ భవిష్యత్తుకే
- ప్రధాని మోదీకి రాష్ట్రంపై ఎంతో మమకారం..
- మహబూబ్‌నగర్ సభలో భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా



మహబూబ్‌నగర్

పురపాలిక ఎన్నికల్లో భాజపా అభ్యర్థుల గెలుపు అధికారం కోసం కాదని, తెలంగాణ భవిష్యత్తు కోసమేనని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా అన్నారు. తెలంగాణలో దుష్టపాలన కొనసాగుతోందని, సీఎం రేవంత్‌రెడ్డి ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. 'కాంగ్రెస్ అంటే ముస్లింలు..ముస్లింలు అంటే కాంగ్రెస్' అంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు అందుకు నిదర్శనమన్నారు. మైనార్టీల ఓట్ల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు నిధులు తగ్గిస్తున్నారని - మిగతా2లో

# దివాలా కంపెనీకి రూ.6 వేల కోట్ల పనులా?



- సీఎం సమాధానం చెప్పాలి
- దీని వ్యవహారాలపై వారం క్రితమే సుప్రీం నోటీసులు
- ఈ కంపెనీకి.. సీఎం బంధువుల సంస్థల మధ్య ఆర్థిక లావాదేవీలు
- రేవంత్‌ను కేంద్రమే కాపాడుతోంది
- లేకుంటే దీనిపై విచారణ జరిపించాలి

హైదరాబాద్

రాష్ట్రంలో సుమారు రూ.6 వేల కోట్ల పనులను ఒక దివాలా కంపెనీకి కట్టబెట్టారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. 2023లోనే దివాలా తీసిన ఈ సంస్థలో కొనసాగుతున్న రూ.వందల కోట్ల ఆర్థిక లావాదేవీలపై నిగ్గుతేల్చాలని సుప్రీంకోర్టు వారం కిందటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులిచ్చిందని తెలిపారు. ఇది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బినామీ సంస్థ అని ఆరోపించారు. -

## ద్రోహి.. శత్రువు

- రాహుల్, బిట్టూ మధ్య తీవ్ర వాగ్వాదం
- ఏదో యుద్ధంలో గెలిచి వచ్చినట్లు ఇక్కడ కూర్చున్నారంటూ బిట్టూ ధ్వజం



5

# జనంపై 'సర్' బుల్డోజర్



- ప్రజాస్వామ్యాన్ని కాపాడండి
- ఎస్ఐఆర్ ప్రక్రియను నిరసిస్తూ నేరుగా సుప్రీంకోర్టులో మమత వాదన
- వాదనకు 5 నిమిషాలడిగితే 15 నిమిషాలిచ్చిన కోర్టు
- ప్రతి సమస్యకు పరిష్కారముంటుందని సీజేఐ వ్యాఖ్య
- విచారణ సోమవారానికి వాయిదా

5

# హోరెత్తనున్న ప్రచారం

-మొదటిపేజీ తరువాయి

ఆక్షేపించారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ కళాశాల మైదానంలో నిర్వహించిన 'విజయ సంకల్ప సమ్మేళనం'లో ఆయన కీలకోపన్యాసం చేశారు.

'తెలంగాణ గడ్డకు రావడం గర్వంగా ఉంది. శక్తిపీఠమైన జోగులాంబ అమ్మవారికి, తుంగభద్ర తీరాన వెలసిన నవబ్రహ్మ ఆలయాలు, మైసిగండి కాళికాదేవి, ఉమామహేశ్వరాలయాల్లో వెలసిన దేవతలకు ప్రణామాలు. తెలంగాణ ముక్తి కోసం ప్రాణాలర్పించిన అమర వీరులకు నివాళులు. రాష్ట్రం నుంచి పద్మ పురస్కారాలు అందుకున్న చంద్రమౌళి, కృష్ణమూర్తి, బాలసుబ్రహ్మణ్యం, వెంకట్రావు, విజయానంద్‌రెడ్డిలకు అభినందనలు' అంటూ ప్రసంగం ప్రారంభించారు. సర్దార్ వల్లబ్‌భాయ్ పటేల్ చొరవతో నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కలిగిందని తెలిపారు.

పారదర్శకంగా వక్ఫ్ చట్టాలు సవరించేందుకు ప్రధాని మోదీ నడుం బిగించారని, తెలంగాణలో మాత్రం రూ.లక్షల కోట్ల విలువైన 77 వేల ఎకరాలు వక్ఫ్‌కే అప్పగించారని నితిన్ నబీన్ ఆరోపించారు. సనాతన ధర్మాన్ని అగౌరవపరుస్తూ.. చంగిచర్లలో ముత్యాలమ్మ దేవాలయాన్ని అపవిత్రం చేశారని, హిందూ దేవతలను కించపరుస్తూ, దేవాలయాలపై దాడులు చేస్తున్నా ఈ ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. హిందూ పండగలపై ఆంక్షలు విధిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. 'మహిళా సాధికారతకు మోదీ ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొస్తుండగా..రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరిస్తోంది. మహిళలకు రూ.2,500, రైతు భరోసా కింద రూ.15 వేలు, అంబేద్కర్ అభయహస్తం వంటి హామీలు ఏమయ్యాయి' అంటూ నిలదీశారు.

**ఆర్ఆర్ టాక్సు చెల్లిస్తేనే బిల్లులు..**

గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం మాదిరిగానే..ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా కమీషన్లు, భూ మాఫియా నడుపుతోందని నితిన్ నబీన్ విమర్శించారు. పనులు జరగాలన్నా, బిల్లులు రావాలన్నా ఆర్ఆర్(రాహుల్, రేవంత్) టాక్సు చెల్లించాల్సిన పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. 'ఈ ప్రాంత ప్రజలపై మోదీకి మమకారం ఉంది. అందుకే బడ్జెట్‌లో రూ.వేల కోట్ల నిధులతో హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-పుణె మధ్య హైస్పీడ్ రైళ్లను కేటాయించారు. హైదరాబాద్-నాగ్‌పూర్, హైదరాబాద్-వరంగల్ పారిశ్రామిక కారిడార్లు, పసుపు బోర్డు ఏర్పాటుచేసిన ఘనత ప్రధానిదే' అని తెలిపారు. తెలంగాణలో భాజపాకు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 30 శాతం, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 35 శాతం ఓట్లు వచ్చాయని, ఈసారి ప్రతి బూత్ నుంచి 50 శాతం ఓట్ల సాధన లక్ష్యంతో పనిచేయాలని నితిన్ నబీన్ పార్టీ శ్రేణులకు సూచించారు. మహారాష్ట్ర, కేరళ, పంజాబ్ స్థానిక ఎన్నికల్లో ప్రజలు భాజపాకే పట్టం కట్టారని, తెలంగాణ ప్రజలూ మోదీ నాయకత్వానికే మద్దతు ఇవ్వాలని కోరారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపా జెండా రెపరెపలాడాలని ఆకాంక్షించారు.

**రాహుల్, కేసీఆర్‌ల మధ్య అంతర్గత ఒప్పందం**

**సాగదీతలా ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తు**

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేవలం ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 'భారత రాష్ట్ర సమితి ప్రభుత్వంలోని పెద్దలను అవినీతి, అక్రమాల కేసుల్లో జైలుకు పంపుతానన్న సీఎం..ఇప్పటివరకు చేసిందేమీ లేదు. కేసీఆర్, రాహుల్‌గాంధీ మధ్య అంతర్గత ఒప్పందాలు కుదిరాయి. 'నేను కొట్టినట్లు నటిస్తా.. నువ్వు ఏడ్చినట్లు నటించు' అన్నట్టు ఇరు పార్టీలు వ్యవహరిస్తున్నాయి. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం పౌరహక్కుల్ని కాలరాసింది. అప్పట్లో పోలీసులు.. మీడియా, సినీ నటులు, ఎమ్మెల్యేలు, మంత్రులే కాకుండా సొంత పార్టీ నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేశారు. అక్రమ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలుంటాయని బీరాలు పలికిన ప్రస్తుత ప్రభుత్వ పాలకులు విచారణను సీరియల్‌లా సాగదీస్తున్నారు. తాజాగా డీఎస్పీకి.. సీఐగా డిమోషన్ ఇచ్చారు. ఇన్నాళ్లుగా చేసింది ఇదొక్కటే.

భాజపా అధికారంలోకి వస్తే అవినీతిపై ఉక్కుపాదం మోపుతాం. భాజపా కొత్తగా ఏ కార్యక్రమం చేపట్టినా పాలమూరు నుంచి శ్రీకారం చుట్టడం ఆనవాయితీ. గతంలో పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు ఎడ్లబండ్ల యాత్ర, తెలంగాణ ఉద్యమ యాత్ర ఇక్కడి నుంచే ప్రారంభించాం. ఇప్పుడు భాజపా జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నితిన్ నబీన్ సిన్హా ఇక్కడి నుంచే పుర, కార్పొరేషన్ ఎన్నికల సమర శంఖారావాన్ని పూరించారు' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో డీకే అరుణను గెలిపించినట్లే పుర ఎన్నికల్లోనూ భాజపా అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. రూ.50 వేల కోట్లతో ప్రతిపాదించిన హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్ పాలమూరు మీదుగానే వెళ్తోందని గుర్తుచేశారు.

**అణచివేయాలని చూస్తున్నారు**

**రామచందర్‌రావు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు**

భాజపా మత రాజకీయాలు చేస్తోందని ఆరోపించే సీఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అంటే ముస్లింలు.. ముస్లింలు అంటే కాంగ్రెస్ అంటూ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి సభలు నిర్వహించిన ప్రతిచోట భాజపా కార్యకర్తలను అరెస్టు చేసి అణచివేయాలని చూస్తున్నారు. వారి బెదిరింపులకు భయపడేది లేదు. గత ఎన్నికల్లో 'కారు.. సారు.. పదహారు' అన్న భారత రాష్ట్ర సమితి పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పి గద్దె దింపారు. అదే గతి కాంగ్రెస్‌కూ పడుతుంది. బడ్జెట్‌లో తెలంగాణకు ఏమిచ్చారని ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర బడ్జెట్‌లో పాలమూరు, నల్గొండ జిల్లాలకు ఏమిచ్చారో సమాధానం చెప్పాలి' అని నిలదీశారు. సమావేశంలో ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కె.లక్ష్మణ్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, పుర ఎన్నికల ఇన్‌ఛార్జి ఆశిష్ షెలార్, నేతలు గౌతంరావు, చింతల రామచంద్రారెడ్డి, టి.ఆచారి, బి.శాంతికుమార్, జాఫర్, జి.పద్మజారెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, నాగురావు నామాజీ తదితరులు పాల్గొన్నారు.

# వందరోజుల కార్యాచరణ

హైదరాబాద్

ఉన్నత విద్యలో విద్యార్థుల ప్రవేశాలు పెంచేందుకు కృషి చేయాలని విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా అధికారులకు సూచించారు. ఈ దిశగా వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను ముందుకు తెచ్చారు. ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి నేతృత్వంలో బుధవారం ఉన్నత స్థాయి అధికారుల సమావేశం జరిగింది. పలు యూనివర్సిటీల వీసీలు కూడా పాల్గొన్నారు. డిగ్రీ కోర్సుల్లో తగ్గుతున్న ప్రవేశాలు, మధ్యలో విద్యను మానేస్తున్న విద్యార్థుల పరిస్థితి, నైపుణ్యం కొరత, కోర్సుల్లో కొత్తదనం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ లోపాలను అధిగమించే దిశగా వంద రోజుల్లో బృహత్తర కార్యాచరణకు ఏ విధంగా సిద్ధమవుతారో నివేదిక ఇవ్వాలని యోగితా రాణా కోరారు. నాణ్యత ప్రమాణాలకు గీటురాయిగా చెప్పుకునే జాతీయ ర్యాంకుల సాధనకు ప్రతి కాలేజీ చొరవ చూపేలా చూడాలని వీసీలకు సూచించారు. వంద రోజుల ప్రణాళికలో సమయ పాలన, ఉన్నత విద్యలో మంచి ఫలితాల సాధనకు చర్యలు, సంస్కరణలకు పెద్ద పీట వేయాలని చెప్పారు.

డిజిటల్ విద్యకు ప్రాధాన్యం: బాలకిష్టారెడ్డి

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని చోట్ల డిజిటల్ విద్యకు ప్రాధాన్యమివ్వాలని, అవసరమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి సూచించారు. యూనివర్సిటీలు పాలన సామర్థ్యం పెంచుకోవాలని అన్నారు. గ్రాడ్యుయేట్లు ఉపాధి అవకాశాలు పెంచుకునే దిశగా నైపుణ్యంతో కూడిన విద్యను అందించాలని కోరారు. సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన ఈ సందర్భంగా వంద రోజుల ఫ్రేమ్‌వర్క్‌ను వివరించారు.

పారిశ్రామిక భాగస్వామ్యంతో ఇంటర్న్‌షిప్‌లు ఏర్పాటు చేయాలని, ఏఐ ఆధారిత కెరీర్ ఎక్సలెన్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రణాళికలో లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఉమ్మడి గ్రాడ్యుయేట్ ప్రమాణాల రూపకల్పన, పరిశోధనా సౌకర్యాల ఏర్పాటు, అధ్యాపక శిక్షణ కార్యక్రమాలు, ఏకీకృత ఇంటర్న్‌షిప్ గ్రిడ్ ఏర్పాటు, పరిశోధన మిషన్ ఏర్పాటును ఇందులో చేర్చారు. కార్యక్రమంలో మండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ఎస్కే మహమూద్, పలు వర్సిటీల వీసీలు పాల్గొన్నారు.




## వడ్డించే వాడు.. అడిగే వాడు.. మనోడై ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

నిర్మిస్తున్నాం. రెండేళ్లలో 70 వేల ఉద్యోగాలు ఇచ్చాం. 1000 బస్సులను మహిళలకు ఇచ్చి యజమానులను చేశాం. రూ.25 వేల కోట్లను మహిళా సంఘాలకు ఇచ్చాం. పెట్రోల్ బంకులు పెట్టించాం. ప్రజా ప్రభుత్వం వల్లనే ఇవన్నీ సాధ్యమయ్యాయి. ప్రభుత్వ కార్యక్రమాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలి. పథకాల ద్వారా లబ్ధి పొందిన వారంతా కాంగ్రెస్‌కు ఓటు వేయాలి. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం చేసిన మహిళలంతా కాంగ్రెస్‌కే ఓటేయాలి. బీజేపీ, బీఆర్‌ఎస్ వాళ్ల డిపాజిట్లు గల్లంతు కావాలి..' అని సీఎం అన్నారు.

**మరిన్ని లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం**

'వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించారు. కేసీఆర్ మాత్రం డబుల్ బెడ్ రూమ్ పేరుతో పేదలను ఊరించి తాను మాత్రం వందల ఎకరాల్లో ఫామ్‌హౌస్ కట్టుకున్నారు. పంజాగుట్టలో రూ.2 వేల కోట్లతో గడీని కట్టుకున్నారు. కానీ మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. వచ్చే బడ్జెట్‌లో మరిన్ని లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం. మరింత మంది పేదల ఆత్మగౌరవాన్ని పెంచుతాం..' అని రేవంత్ చెప్పారు.

**మొగుడూ పెళ్లాల ఫోన్లు విన్నారు**

'పదేళ్లు అధికారంలో ఉండి కేసీఆర్ తన దుర్మార్గ పాలనతో తెలంగాణను దోచుకున్నారు. అయినా పోనీలే అనుకుంటే.. పెళ్లాం, మొగుడు మాట్లాడుకుంటుంటే ఫోన్లు విన్నారు. జర్నలిస్టులు, సినిమా తారలు, జడ్జీలు.. అందరి ఫోన్లు విన్నారు. అలాంటి వ్యక్తికి పోలీసులు నోటీసులు ఇస్తే జాతిపితకు నోటీసులు ఇస్తారా? అని అంటున్నారు. భార్యభర్తల మాటలు విన్న నువ్వు జాతిపితవు ఎలా అవుతావు? కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే తెలంగాణ సమాజానికి ఇచ్చేనట్లే అంటున్నారు. అలాగైతే జన్వాడ, ఎర్రవల్లి, మొయినాబాద్ ఫాంహౌస్‌లను, టీవీలు, పేపర్లను, దోచుకున్న వేలాది కోట్లను తెలంగాణ సమాజానికి ఇస్తారా? ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రి..అన్ని పదవులూ వారే తీసుకున్నారు. తెలంగాణ కోసం మొదటగా ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు చిన్న పదవి కూడా ఇవ్వలేదు. తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ జాతిపిత అవుతారు. ఏపీలో పార్టీ చనిపోయినా, కేంద్రంలో ప్రభుత్వం పోయినా పరవాలేదని తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ తెలంగాణ తల్లి అవుతుంది. నీలాంటి వాళ్లు ఎలా జాతిపిత అవుతారు?..' అంటూ సీఎం తీవ్ర పదజాలంతో ప్రశ్నించారు. చేసిన తప్పులకు ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. ఈ సభలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, పద్మావతి, వేముల వీరేశం, జైవీర్‌రెడ్డి, బాలునాయక్, మందుల సామేలు, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కేవీ రెడ్డి, డీసీసీల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

**శంకుస్థాపనలు, ముఖాముఖి**

సభకు ముందు రూ.200 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. మహిళా సంఘాలకు రుణాల చెక్కులు అందజేశారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులతో ముఖాముఖి మాట్లాడారు.

**నేడు గుమ్లాపూర్‌లో సభ**

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: బల్దియా ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం కరీంనగర్ జిల్లాలో పర్యటించనున్నారు. చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని గుమ్లాపూర్‌లో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు. అక్కడి నుంచే రామడుగు మండలం వెదిరలో అడ్వాన్స్‌డ్ శిక్షణా కేంద్రానికి, దత్తోజీపేటలో సోలార్ ప్లాంట్‌కు, గంగాధరలో డిగ్రీ కళాశాలకు శంకుస్థాపన చేస్తారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేస్తారు. కాగా బుధవారం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తదితరులు సభాస్థలిని పరిశీలించారు.

## దివాలా కంపెనీకి రూ.6 వేల కోట్ల పనులా?

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణ భవన్‌లో కేటీఆర్ బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "2018లో ఈ కంపెనీపై, ప్రస్తుత ముఖ్యమంత్రి బంధువుల కంపెనీలపై ఐటీ దాడులు జరిగాయి. అప్పుడే అవి రేవంత్ బంధువుల కంపెనీలని బయటపడింది. ఆయా సంస్థల మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఐటీ అధికారులు గుర్తించారు. ఆ ఇన్‌ఫ్రా కంపెనీ పేరుతో కొనుగోలు చేసిన ల్యాండ్ క్రూయిజర్ కారును ముఖ్యమంత్రి అయ్యాక కూడా రేవంత్ వాడుకున్నారు. ఈ కంపెనీకి మరో సంస్థకు మధ్య 2023లో గొడవ జరిగింది. ఆ రెండూ నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ను అప్రోచ్ అయ్యాయి. ఆ కేసు నడుస్తోంది. అక్కడ ఈ కంపెనీ 'కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్' పిటిషన్ వేసి... తాము దివాలా తీశామనే విషయాన్ని స్పష్టంగా పేర్కొంది. తమ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి రూ.15 లక్షలు కూడా లేవని చెప్పి.. బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుంది. దీంతో ఈ కంపెనీలో ఆర్థిక లావాదేవీలను ఎన్‌సీఎల్‌టీ నిషేధించింది. ఇలాంటి చరిత్ర ఉన్న కంపెనీకి... రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అమృత్ స్కీమ్, జల్‌జీవన్ మిషన్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్, తెలంగాణ సాగునీటి ప్రాజెక్ట్ పనులు, రహదారుల పనులు... కలిపి సుమారు రూ.6,000 కోట్ల కాంట్రాక్టులను అడ్డగోలుగా కట్టబెట్టారు. 2023లో దివాలా తీసిన కంపెనీకి.. 2024-26 సంవత్సరాల్లో తెలంగాణ ప్రభుత్వం ఇన్ని కాంట్రాక్టులు ఎలా ఇచ్చిందన్న విషయానికి సీఎం సమాధానం చెప్పాలి? ఈ కంపెనీ ఆర్థిక అవకతవకలపై సీబీఐ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆర్గనైజేషన్, ఈడీలతో విచారణ జరిపించాలని కేంద్రానికి, రాష్ట్రానికి సుప్రీంకోర్టు నోటీసు ఇచ్చినా... ఎందుకు దర్యాప్తునకు ఆదేశించలేదు? ఈ అంశాన్ని దాచిపెట్టి.. ప్రజల దృష్టిని మళ్లించడానికే నాతోపాటు హరీశ్‌రావు, సంతోష్‌రావు, కేసీఆర్‌లకు సిట్ నోటీసులిచ్చి డ్రామా నడిపించారు. ముఖ్యమంత్రిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వం కాపాడుతుంది నిజం కాకపోతే... ఈ మొత్తం వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో సమగ్ర విచారణ జరిపించాలి. విచారణ పూర్తయ్యే వరకూ ఈ కంపెనీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి.. ఇచ్చిన కాంట్రాక్టులను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.


# సమ్మక్క'కు ఎన్ఓసీలో కదలిక

హైదరాబాద్

సమ్మక్క సాగర్ బరాజ్‌లో గరిష్ట నీటిమట్టం (ఎఫ్ఆర్ఎల్) మేర నీటిని నిల్వ చేస్తే ఛత్తీస్‌గఢ్ భూభాగంలో ఏర్పడనున్న ముంపు ప్రభావంపై సర్వే నిర్వహించేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. సర్వే నిర్వహణకు రూ.9.88 కోట్ల వ్యయం కానుందని, ఈ మేరకు నిధులను తమ రాష్ట్రానికి జమ చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి గత నెల 24న లేఖ రాసింది. సర్వే నివేదిక అందిన తర్వాత ప్రాజెక్టు నిర్మాణానికి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) జారీ చేసే విషయంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. సమ్మక్కసాగర్ నిర్మాణంతో ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ముంపునకు గురికానున్న భూములు, గ్రామాలు, ఇతర ఆస్తుల విషయంలో పూర్తి పరిహారం చెల్లిస్తామని ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం అంగీకరించిందని గుర్తు చేసింది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గత సెప్టెంబర్ 22న ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయితో సమావేశమై ప్రాజెక్టుకు ఎన్ఓసీ జారీ చేయాలని విజ్ఞప్తి చేయగా, అక్కడి సీఎం సానుకూలంగా స్పందించిన విషయం తెలిసిందే.


సమ్మక్క బరాజ్‌తో ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురికానున్న భూముల సేకరణ, పరిహార చెల్లింపు, పునరావాస కల్పన విషయంలో తెలంగాణ సంపూర్ణ బాధ్యత తీసుకుంటుందని అప్పట్లో హామీ ఇచ్చారు. బీజాపూర్ జిల్లా భూపాలపట్నం తహసీల్ పరిధిలో 13.06 హెక్టార్ల భూములు, 53.03 హెక్టార్ల నది, 6.35 హెక్టార్ల నాలా భూమి ముంపునకు గురికానుందని ప్రాథమికంగా తేల్చారు. ఛత్తీస్‌గఢ్ ఎన్ఓసీ జారీ చేస్తే ప్రాజెక్టుకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అనుమతులకు ప్రధాన అడ్డంకి తొలగిపోనుంది. ములుగు జిల్లాలో తుపాకులగూడెం వద్ద గోదావరిపై 6.7 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 83 మీటర్ల ఎత్తులో సమ్మక్కసాగర్‌ను నిర్మిస్తున్నారు.

శ్రీరాంసాగర్ రెండో దశ కింద ఉన్న 1.78 లక్షల హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణతోపాటు రామప్పపాకాల లింక్ కాల్వ కింద 12,146 హెక్టార్ల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ఈ ప్రాజెక్టుతో వరంగల్, సూర్యాపేట, మహబూబాబాద్, జనగామ, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో వ్యవసాయం దశ మారుతుందని, నమ్మకమైన సాగునీటి సరఫరాతో కరువు నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ప్రాజెక్టులో భాగంగా బరాజ్‌తోపాటు అప్రోచ్ కాల్వలు, గ్రావిటీ కాల్వలు, 3 పంప్‌హౌస్‌లు, డెలివరీ సిస్టర్న్లు, 90 కి.మీల సొరంగాల నెట్‌వర్క్ నిర్మిస్తున్నారు.



# బాధ్యత దులిపేసుకున్న మోదీ

న్యూఢిల్లీ




భారత్‌చైనా మధ్య 2020లో జరిగిన ఘర్షణ సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యతాయుతంగా వ్యవహరించలేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ముఖ్యమైన బాధ్యతను అప్పటి ఆర్మీ చీఫ్‌పైకి నెట్టేసి, చేతులు దులుపుకున్నారని ధ్వజమెత్తారు. దేశ భద్రతకు సంబంధించిన అత్యంత సంక్షోభ సమయంలో మోదీ అలా తప్పించుకోవడం ఏమిటని నిలదీశారు. ప్రజలు ప్రశ్నలు అడిగితే ప్రభుత్వం సమాధానం చెప్పకుండా పారిపోతోందని విమర్శించారు. రాహుల్ బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం.నరవణే రచించి, ఇంకా అధికారికంగా విడుదల చేయని జ్ఞాపకాల పుస్తకాన్ని ప్రదర్శించారు. అందులోని కీలక అంశాలను ప్రస్తావించారు. ఈ పుస్తకం నిజంగా ఉందన్న సంగతిని యువత తెలుసుకోవాలని కోరారు. అసలు ఇలాంటి పుస్తకమే లేదని ప్రభుత్వం నమ్మబలుకుతోందని, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ అదేమాట చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తూర్పు లద్దాఖ్‌లో గల్వాన్ ఘర్షణ సమయంలో ఏం జరిగిందో నరవణే సవివరంగా రాశారని తెలిపారు.

**మోదీ వస్తే పుస్తకం అందజేస్తా..**

"చైనా యుద్ధ ట్యాంకులు కైలాస పర్వతం దాకా దూసుకొచ్చాయి.. ఇప్పుడేం చేయాలని ఆర్మీ చీఫ్ జనరల్ నరవణే విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తోపాటు రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను అడిగారు. అందుకు వారు సమాధానం చెప్పలేదు. దాంతో రాజ్‌నాథ్ సింగ్‌ను మళ్లీ అడిగారు. ఉన్నత స్థాయి వాళ్లను(ప్రధానమంత్రి) అడిగి చెప్తానని రాజ్‌నాథ్ బదులిచ్చారు. రాజ్‌నాథ్ వెళ్లి ప్రధానమంత్రిని అడిగితే.. మీకు ఏది సముచితం అనిపిస్తే అదే చేయండి అంటూ మోదీ బాధ్యత దులిపేసుకున్నారు. చైనా యుద్ధ ట్యాంకులు మన భూభాగంలోకి ప్రవేశించినా తనకు సంబంధం లేదన్నట్లుగా మాట్లాడారు. దాంతో ఈ అంశంలో పూర్తిగా ఒంటరిగా మారిపోయినట్లు భావించానని నరవణే తన పుస్తకంలో రాశారు. ఇదే విషయం నేను పార్లమెంట్‌లో చెప్తానని ప్రభుత్వం భయపడుతోంది. అందుకే నన్ను సభలో మాట్లాడనివ్వడం లేదు. లోక్‌సభకు వచ్చేంత ధైర్యం ప్రధాని మోదీకి ఉందని నేను అనుకోవడం లేదు. ఒకవేళ ఆయన వస్తే ఈ పుస్తకం అందజేస్తా" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అనంతరం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఈ పుస్తకం ప్రతిపక్ష నేత గానీ, విదేశీ రచయిత గానీ రాయలేదని వెల్లడించారు. మాజీ ఆర్మీ చీఫ్ రాశారని పేర్కొన్నారు. అయినా ఇలాంటి పుస్తకం లేనేలేదని అంటున్నారని తప్పుబట్టారు. పార్లమెంట్‌కు వచ్చి, నిజాన్ని ఎదుర్కొనే ధైర్యం మోదీకి లేదని తేల్చిచెప్పారు.

**ప్రభుత్వం భయపడుతోంది: ప్రియాంక**

చైనాతో ఘర్షణ జరిగినప్పుడు మోదీ ప్రభుత్వ నిర్వాకం ఏమిటో జనరల్ నరవణే బయటపెట్టారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా పేర్కొన్నారు. నిజాలు ప్రజలకు తెలుస్తాయని మోదీ సర్కార్ భయపడుతోందని, అందుకే లోక్‌సభలో మాట్లాడేందుకు రాహుల్ గాంధీకి అనుమతి ఇవ్వడం లేదని బుధవారం విమర్శించారు. బీజేపీ ఎంపీలు కూడా గతంలో పుస్తకాలు, మేగజైన్లు, రిపోర్టులను ప్రస్తావిస్తూ పార్లమెంట్‌లో మాట్లాడారని గుర్తుచేశారు. ప్రధాని మోదీ కూడా సంజయ్‌బారు పుస్తకం గురించి మాట్లాడారని తెలిపారు. నరవణే పుస్తకంపై రాహుల్ మాట్లాడితే తప్పేమిటని ప్రశ్నించారు. అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ఎంపీలకు ఉందన్నారు.

# ద్రోహి.. శత్రువు

న్యూఢిల్లీ



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ బిట్టూ మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం కొనసాగింది. బుధవారం ఉదయం పార్లమెంట్ మకరద్వారం వద్ద ఇరువురు నేతలు ఎదురుపడ్డారు. పార్లమెంట్ నుంచి సస్పెండైన విపక్ష ఎంపీలకు సంఘీభావంగా రాహుల్ మాట్లాడేందు సిద్ధమవుతుండగా ఇంతలోనే బిట్టూ అక్కడికి వచ్చారు. విపక్ష ఎంపీలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఏదో యుద్ధంలో గెలిచి వచ్చినట్లు ఇక్కడ కూర్చున్నారంటూ బిట్టూ ఎద్దేవా చేశారు. దానిపై రాహుల్ ఘాటుగా బదులిచ్చారు. "ఒక ద్రోహి మన పక్కనుంచే వెళ్తున్నాడు. అతడి ముఖం చూడండి. ఎలా కనిపిస్తున్నాడో చూడండి. హలో బ్రదర్. నా ద్రోహి మిత్రుడా.. ఆందోళన చెందకు. నువ్వు మళ్లీ కాంగ్రెస్‌లోకి వస్తావు" అంటూ వ్యాఖ్యానించారు. బిట్టూతో కరచాలనం చేసేందుకు ప్రయత్నించారు. అయితే, రాహుల్‌తో కరచాలనానికి బిట్టూ నిరాకరించారు.

రాహుల్ వైపు చూస్తూ దేశానికి శత్రువు(దేశ్ కీ దుష్మన్) అంటూ నిందించారు. అక్కడున్న సస్పెండైన ఎంపీలను, కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి దేశ్ కీ దుష్మన్ అంటూ పలుమార్లు అన్నారు. ఈ వీడియోలను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో పోస్టుచేసింది. అనంతరం బిట్టూ మీడియాతో మాట్లాడారు. 'రాహుల్ గాంధీ చెడిపోయిన పిల్లాడు' అంటూ నిందించారు. అక్కడ ఎంతోమంది ఎంపీలు ఉండగా, సిక్కు మతస్థుడినైన తనను ఉద్దేశించి అనుచితంగా మాట్లాడారని రాహుల్‌పై మండిపడ్డారు. "తామే పెద్ద దేశభక్తులమని గాంధీలు పదేపదే చెప్పుకుంటారు. రాహుల్ తండ్రి రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని అంటుంటారు. మా తాత బియాంత్ సింగ్ పంజాబ్‌లో బలిదానం చేశారు. గాంధీ కుటుంబం సృష్టించిన ఉగ్రవాదానికి ఆయన బలయ్యారు. సిక్కుల రక్తంతో గాంధీల చేతులు తడిచాయి. సిక్కు వ్యతిరేక గొడవల్లో ఎంతోమంది చనిపోయారు. సిక్కులను హత్య చేసి, గురుద్వారాలను కూల్చేసిన గాంధీ కుటుంబ వారసులతో ఈ సర్దార్ ఎప్పటికీ చేతులు కలపడు. మళ్లీ కాంగ్రెస్‌లో చేరే ప్రసక్తే లేదు. నాకు జరిగిన అవమానాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్తా" అని బిట్టూ స్పష్టంచేశారు.

**రాహుల్ క్షమాపణ చెప్పాలి**

కేంద్ర మంత్రి రవనీత్‌సింగ్ బిట్టూ ద్రోహి అంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి సహా బీజేపీ నేతలు, సిక్కు నాయకులు తప్పుపట్టారు. కాంగ్రెస్ పార్టీ సిక్కులకు వ్యతిరేకం అన్న సంగతి మరోసారి తెలిసిపోయిందని అన్నారు. రాహుల్ గాంధీని సిక్కులు ఎప్పటికీ క్షమించబోరని తేల్చిచెప్పారు. మరోవైపు రాహుల్ వ్యాఖ్యలను ఖండిస్తూ ఢిల్లీలో కాంగ్రెస్ కార్యాలయం ఎదుట బీజేపీ నేతలు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు. సిక్కు వర్గాన్ని కించపర్చినందుకు రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. రాహుల్ వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎంపీ అమరీందర్ సింగ్ రాజా సమర్థించారు. ద్రోహిని ద్రోహి అనకపోతే ఇంకేం అంటారని ప్రశ్నించారు. బిట్టూకు కాంగ్రెస్ ఎంతో చేసిందని, అయినా సరే పార్టీకి ద్రోహం చేసి వెళ్లిపోయాడని ఆరోపించారు.

## మన ఆహార, వ్యవసాయ రంగాలకు పూర్తి రక్షణ

న్యూఢిల్లీ

అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తేల్చిచెప్పారు. మన దేశ ఆహార, వ్యవసాయ రంగాలకు ఈ ఒప్పందంలో పూర్తి రక్షణలు ఉన్నట్లు తెలిపారు. ఆయన బుధవారం తొలుత లోక్‌సభలో, తర్వాత రాజ్యసభలో ఈ మేరకు ప్రకటన చేశారు. మన దేశ ప్రయోజనాల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం రాజీ పడబోదని అన్నారు. అమెరికాతో ఒప్పందం వల్ల మనకు లాభం చేకూరుతుందని ప్రకటించారు. అమెరికా మార్కెట్‌లో భారతీయ వస్తువులకు ప్రాధాన్యం పెరుగుతుందన్నారు. ఎగుమతుల విషయంలో మన పోటీ సామర్థ్యం మరింత ఇనుమడిస్తుందని వివరించారు. ఈ ఒప్పందం హఠాత్తుగా కుదిరిందని కాదని, భారత్, అమెరికా మధ్య పలు దఫాల చర్చల తర్వాతే తుదిరూపు వచ్చిందని స్పష్టంచేశారు. ఇది సమతుల్య, పరస్పర ప్రయోజనాత్మక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందమని పేర్కొన్నారు.

## మణిపుర్ సీఎంగా ఖేమ్‌చంద్ ప్రమాణం

ఇంఫాల్

మణిపుర్‌లో ఎట్టకేలకు ప్రజాప్రభుత్వం కొలువుదీరింది. భాజపా నేత యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ (62) రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణం చేశారు. కుకీ సామాజిక వర్గానికి చెందిన నెమ్చా కిప్‌గెన్ (భాజపా), నాగా సామాజిక వర్గానికి చెందిన నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) శాసనసభ్యుడు ఎల్ డిఖో ఉప ముఖ్యమంత్రులుగా నియమితులయ్యారు. జాతుల మధ్య ఘర్షణలతో మణిపుర్ 2023 మే 3 నుంచి అట్టుడికింది. ఈ ఘర్షణల్లో దాదాపు 260మంది మృత్యువాతపడ్డారు. తర్వాతి పరిణామాల నేపథ్యంలో నిరుడు ఫిబ్రవరి 9న అప్పటి సీఎం బీరెన్‌సింగ్ రాజీనామా చేశారు. అదే నెల 13 నుంచి మణిపుర్ రాష్ట్రపతి పాలనలో ఉంది. తాజాగా రాష్ట్ర ఎన్డీయే భాగస్వామ్య పక్షాల ఎమ్మెల్యేలు దిల్లీలో మంగళవారం సమావేశమై ఖేమ్‌చంద్‌ను తమ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈ క్రమంలో మణిపుర్‌లో రాష్ట్రపతి పాలనను ఎత్తివేస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం– ఖేమ్‌చంద్ నేతృత్వంలో ఎన్డీయే బృందం గవర్నర్ అజయ్‌కుమార్ భల్లాను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతివ్వాలని కోరింది. రాష్ట్రపతి పాలనను ఎత్తివేసిన కొన్ని గంటల్లోనే సీఎంగా ఖేమ్‌చంద్‌తో గవర్నర్ ప్రమాణం చేయించారు. గోవిందాస్ కొంథౌజమ్ (భాజపా), కె.లోకెన్‌సింగ్ (ఎన్‌పీపీ) కూడా మంత్రులుగా ప్రమాణం చేశారు. ఖేమ్‌చంద్‌కు తైక్వాండాలో బ్లాక్‌బెల్ట్ ఉంది. భారత తైక్వాండో సమాఖ్యకు గతంలో ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 2012లో తృణమూల్ కాంగ్రెస్ టికెట్‌పై అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 2013లో భాజపాలో చేరారు. 2017లో సింగ్‌జేమీ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొంది 2022 వరకు అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022లోనూ శాసనసభ ఎన్నికల్లో గెలిచి.. మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

# సభలో రచ్చరచ్చ

న్యూఢిల్లీ

అమెరికాతో వాణిజ్య ఒప్పందం, మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం.నరవణే పుస్తకంపై లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు బుధవారం సైతం ఆందోళనకు దిగారు. ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలకు నిజాలు బహిర్గతం చేయాలని పట్టుబట్టారు. సభలో బ్యానర్లు ప్రదర్శిస్తూ నినాదాలతో హోరెత్తించారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలియజేసే తీర్మానంపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించాల్సి ఉండగా, ఆయన సభకు హాజరు కాలేదు. ఉదయం సభ ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు తమ స్థానాల్లో నిల్చొని నినాదాలు ప్రారంభించారు. శాంతించాలంటూ స్పీకర్ విజ్ఞప్తి చేసినా వారు వినిపించుకోలేదు. దాంతో స్పీకర్ సభను ఉదయం 11 గంటల దాకా వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా విపక్ష సభ్యుల ఆందోళన ఆగలేదు. ప్రభుత్వం సమాధానం చెప్పేదాకా విడిచిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. విపక్ష ఎంపీలు తొలుత వెల్‌లో బైఠాయించారు.

అనంతరం బ్యానర్లు ప్రదర్శిస్తూ అధికార పక్ష సభ్యులవైపు దూసుకొచ్చారు. నరవణే పుస్తకంపై సభలో రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వారి తీరును కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, అమిత్ షా తప్పుపట్టారు. సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో స్పీకర్ మధ్యాహ్నం 12 గంటల దాకా, తర్వాత 2 గంటల దాకా వాయిదా వేశారు. మరో వాయిదా తర్వాత 5 గంటలకు సభ మళ్లీ ప్రారంభమయ్యాక కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ సమయంలోనే ప్రధాని ప్రసంగించాల్సి ఉంది. కాంగ్రెస్ మహిళా ఎంపీ వర్షా గైక్వాడ్ సహా మరికొందరు మహిళా సభ్యులు ప్రధాని కూర్చొనే స్థానం వద్దకొచ్చి ఘొరావ్ చేశారు. అప్పుడు మోదీ సభలో లేరు. వెనక్కి రావాలంటూ కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు కోరినా విపక్ష సభ్యులు పట్టించుకోలేదు. పరిస్థితి సద్దుమణగకపోవడంతో స్పీకర్ స్థానంలో ఉన్న సంధ్యా రాయ్ సభను మరుసటి రోజుకు వాయిదా వేశారు. పరిస్థితి అదుపులో లేకపోవడం వల్లనే మోదీ సభకు రాలేదని బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ చెప్పారు.

**రాహుల్‌కు పోటీగా దూబే పుస్తక ప్రదర్శన..**

మధ్యాహ్నం 2 గంటలకు సభ పునఃప్రారంభమైన తర్వాత బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే 'ఎడ్వినా అండ్ నెహ్రూ', 'మిత్రోఖిన్ ఆర్కైవ్' అనే పుస్తకాలను సభలో ప్రదర్శిస్తూ వాటి గురించి ప్రస్తావించడంతో వివాదం మొదలైంది. దివంగత ప్రధానమంత్రులు నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీపై ఆయన విమర్శలు చేశారు. వారు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అయితే, సభలో పుస్తకాల గురించి ప్రస్తావించడానికి వీల్లేదని సభాపతి స్థానంలో ఉన్న కృష్ణప్రసాద్ తెన్నేటి స్పష్టంచేశారు. నిషికాంత్ దూబే తీరుపై మండిపడుతూ కాంగ్రెస్ సహా ఇతర విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. పరిస్థితి అదుపు తప్పేలా ఉండడంతో సభాపతి లోక్‌సభను సాయంత్రం 5 గంటల దాకా వాయిదా వేశారు. తర్వాత కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. నిషికాంత్ దూబేపై సస్పెన్షన్ వేటు వేయాలని డిమాండ్ చేశారు.

## జనంపై 'సర్' బుల్డోజర్

న్యూఢిల్లీ

ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వే సక్రమంగా జరగట్లేదని, పనిఒత్తిడితో బూత్ లెవల్ అధికారులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, బాధితులను ఢిల్లీకి తీసుకొచ్చి బెంగాల్ అంశాన్ని హస్తిన వేదికగా చర్చనీయాంశంగా మార్చిన పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బుధవారం ఈ అంశంపై నేరుగా సర్వోన్నత న్యాయస్థానంలో తన వాదనలు స్వయంగా వినిపించారు. ఐదు నిమిషాలు సమయం ఇస్తే సూటిగా, స్పష్టంగా తమ వాదనలను విన్పిస్తానని మమత కోరగా ధర్మాసనం ఏకంగా 15 నిమిషాల సమయం కేటాయించడం విశేషం. భారతదేశ చరిత్రలోనే తొలిసారిగా స్వయంగా ముఖ్యమంత్రి సుప్రీంకోర్టులో రాష్ట్ర కేసును వాదిస్తుండటంతో ఆమె వాగ్ధాటిని వినేందుకు న్యాయవాదులు సీజేఐ కోర్టురూమ్‌లోకి ఎగబడ్డారు. ఈ ఘటనకు సర్వోన్నత న్యాయస్థానం వేదికైంది.

**ఈసీ ఒక వాట్సాప్ కమిషన్..**

తమ రాష్ట్రంలో ఎస్ఐఆర్ చేపట్టడాన్ని సవాల్ చేస్తూ మమతా బెనర్జీ, మొస్తారీ బానూ, టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రియాన్, దోలాసేన్‌లు వేసిన పిటిషన్‌పై తానే స్వయంగా వాదనలు విన్పించేదుకు అనుమతించాలంటూ ఇప్పటికే మమత ఇంటులాక్యుటరీ పిటిషన్ వేశారు. దీంతో మమతను వాదనలకు కోర్టు అనుమతించింది. మమత తన వాదనల సందర్భంగా ఎన్నికల కమిషన్‌ను వాట్సాప్ కమిషన్‌గా అభివర్ణించారు.

ఈసీ ఒక వాట్సాప్ కమిషన్. ఉన్నతాధికారులకు కీలక నిర్ణయాలను వాట్సాప్‌లలో పంపిస్తోంది. మా రాష్ట్రంలో అక్ర మంగా జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో కోర్టు జోక్యం చేసుకోవాలి. ఎన్నికల నేపథ్యంలోనే మా రాష్ట్రాన్ని ఈసీ లక్ష్యంగా చేసుకుంది. ఓటర్లపై ఈసీ 'ఎస్ఐఆర్' బుల్డోజర్‌తో తొక్కిస్తోంది. ఎస్ఐఆర్ పేరిట బూత్ లెవల్ అధికారులను ఈసీ అధికా రాలు వేధిస్తున్నారు. వేధింపులు, పని ఒత్తిడితో పెద్దసంఖ్యలో బీఎల్ఓలు ఆత్మహత్యచేసుకున్నారు. రాష్టంలో ప్రజాస్వామ్యాన్ని మీరే కాపాడాలి. ఈ కేసులో న్యాయం కోసం మొదట్నుంచీ మా లాయర్లు శతథా పోరాడుతున్నారు. అయినాసరే మాకు ఎక్కడా న్యాయం దక్కట్లేదు. నేను కూడా కట్టుబానిసను. సాధారణ కుటుంబం నుంచి వచ్చా. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కోసం పోరాడట్లేను. రాష్ట్ర ఓటర్ల ఓటింగ్ హక్కుల కోసం పోరాడుతున్నా. ఇదే విషయమై ఇప్పటికే ఆరు సార్లు ప్రధాన ఎన్నికల కమిషన్ వద్ద మొరపెట్టుకుంటూ లేఖలు రాశా. అయినాసరే ఎలాంటి స్పందన రాలేదు. స్పెల్లింగ్‌లో చిన్నచిన్న తప్పులను ఎత్తిచూపి కోట్లాది ఓట్లను తొలగించొద్దు. ఇతర డాక్యుమెంట్లు అడక్కుండా ఎస్ఐఆర్ వెరిఫికేషన్‌లో ఆధార్‌కార్డ్‌ను గుర్తింపుకార్డుగా అంగీకరించండి" అని మమత కోరారు. దీంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంఛోలీల ధర్మాసనం స్పందించింది. "మీరు చేస్తున్న వాదనల్లో నిజం ఉంది. అయితే ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది" అని వ్యాఖ్యానించింది. ఈ విషయంలో ఫిబ్రవరి 9వ తేదీ(సోమవారం)కల్లా మీ స్పందన తెలపాలని ఎలక్షన్ కమిషన్‌కు, పశ్చిమబెంగాల్ చీఫ్ ఎలక్టోరల్ అధికారికి నోటీసులు జారీచేసింది. బీఎల్ఓలు, ఎలక్టోరల్ రోల్ ఆఫీసర్‌లతో సున్నితంగా వ్యవహ రించాలని, వాళ్లకు నోటీసులు జారీచేసే ముందు ఆలోచించాలని ఈసీకి ధర్మాసనం సూచించింది. కేసు విచారణ సోమవా రానికి వాయిదా వేశారు.

**ఎందుకింత తొందర?**

"ఎస్ఐఆర్ సర్వేను సమగ్రంగా, సంపూర్ణంగా చేయాలంటే కనీసం రెండు సంవత్సరాలు పడుతుంది. కానీ హడావుడి గా కేవలం మూడునెలల్లో ముగించాలని ఎందుకు నిర్ణయించారు? ఇదే సమయంలో రాష్ట్రంలో పండగ సీజన్ ఉంది. పంటల సాగు నడుస్తోంది. అంతా బిజీగా ఉండే సమయంలో హడావిడిగా ఎస్ఐఆర్ ముగించాలని ఎందుకు భావిస్తున్నారు?" అని మమత వాదించారు. వేధింపులతో బీఎల్ఓలు చనిపోతున్నారని మమత వాదించగా ఎలక్షన్ కమిషన్ తరఫు సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది కలగజేసుకుని "ఉద్దేశపూర్వకంగా మమత సర్కార్ తక్కువ పనితనం ఉన్న 80 మంది గ్రేడ్2 అధికారులను మాకు సహాయకులుగా అందించింది" అని వాదించారు. దీనిపై మమత మాట్లాడారు. "ఈసీ నిబంధనల్లో పేర్కొన్న మేరకే తగు రాష్ట్ర ఆఫీసర్లను ఈసీ కోసం కేటాయించాం" అని బదులిచ్చారు. మళ్లీ ద్వివేది మాట్లాడబోగా మమత చేతులు జోడించి "జడ్జిగారు దయచేసి మమ్మల్ని పూర్తిగా మాట్లాడనివ్వండి" అని వేడుకున్నారు. దీంతో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ "మమత ఇంతదూరం వచ్చిందే మాట్లాడేందుకు. అయినా నిజమైన ఓటరు పేరు ఖచ్చితంగా ఓటర్లజాబితా తుది లిస్ట్‌లో ఉండాల్సిందే. తుది జాబితా నుంచి ఏ ఒక్క అమాయకుడిని పేరు తొలగింపునకు గురికావొద్దు" అని అన్నారు. ఇంగ్లిష్ స్పెల్లింగ్‌లో తప్పులుంటే కూడా నోటీస్‌లు ఇస్తున్నారని శ్యామ్ దివాన్ వాదించగా కోర్టు "ఇంగ్లిష్ అంటేనే స్పెల్లింగ్ తప్పులమయం" అని ఒక బెంగాలీ సామెతను గుర్తుచేశారు.

## సంపాదకీయం

# అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ పైచేయి

భారత ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ స్థాయిలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. ప్రపంచవ్యాప్తంగా అగ్రగామి దేశాలతో వరుసగా కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాలతో భారత్ తన ఆర్థిక వ్యూహాన్ని పూర్తిగా మార్చేస్తోంది. ముఖ్యంగా అమెరికాతో కుదిరిన తాజా చారిత్రక వాణిజ్య ఒప్పందం భారత్ ఆర్థిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. ప్రపంచ స్థూల దేశీయ ఉత్పత్తిలో సగానికి పైగా వాటా కలిగిన దేశాలతో భారత్ ప్రస్తుతం వాణిజ్య బంధాలను కలిగి ఉండటం ఇక్కడ గుర్తించాల్సిన విషయం. కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే రెండు కీలకమైన అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేయడం ద్వారా దేశం తన వ్యూహాత్మక దౌత్యాన్ని అనుసరిస్తోంది. భారత్, అమెరికా మధ్య ట్రేడ్ డీల్ కు అంగీకారం జరిగిన తరువాత రష్యా చమురు కొనుగోలు హాట్ టాపిక్ అవుతోంది. అయితే రష్యా ముడి చమురును కొనడం పూర్తిగా ఆపివేయడం వల్ల ఇండియాకు సమస్యలు ఏర్పడవచ్చు. రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ఫిబ్రవరి 3 తన నివేదికలో, భారత్ ఇటీవల నెలల్లో రష్యా నుండి ముడి చమురును కొనడం క్రమంగా తగ్గించిందని పేర్కొంది. అందుకు అమెరికానే కారణం అని తెలిసిందే. అయితే పూర్తి కొనుగోళ్లను ఒక్కసారిగా నిలిపివేస్తే ఆర్థికాభివృద్ధికి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇది దేశంలో సరఫరా లోటుకు కారణంగా మారవచ్చు. చమురు ధరలు పెరిగి ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపవచ్చు అని కొందరు నిపుణులు అంచనా వేశారు. ఎందుకంటే భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద చమురు దిగుమతిదారులలో ఒకటి. అమెరికాతో డీల్ కోసం భారత్ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. రష్యా నుంచి కాకుండా ఇతర దేశాల నుంచి చౌక ధరకు ముడి చమురు కొనడం సవాల్‌గా మారనుంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ధరల పెరుగుదలకు కారణం అవుతుందని, భారత్ వంటి అతిపెద్ద దిగుమతి చేసుకునే దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని మూడీస్ స్పష్టంగా పేర్కొంది. ఆర్థికాభివృద్ధిలో ఇబ్బందులను నివారించడానికి భారతదేశం వెంటనే అన్ని రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను ఆపివేసే అవకాశం లేదని ఏజెన్సీ తెలిపింది. అమెరికా భారత వస్తువులపై టారిఫ్ 50 శాతం నుండి 18 శాతానికి తగ్గించిన వాణిజ్య ఒప్పందం కోసం వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్ త్వరలో రష్యా చమురును కొనడం ఆపివేస్తుందన్నారు. ఇకనుంచి వెనిజులా నుండి ఎక్కువ చమురును కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. భారత్ అమెరికా నుండి 500 బిలియన్ డాలర్లకు పైగా ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని, ఇందులో ముడి చమురు కూడా ఉంటుందని ట్రంప్ అన్నారు. అయితే, ప్రధాని మోదీ మాత్రం టారిఫ్ తగ్గించడంపై మాత్రమే మాట్లాడారు. కానీ రష్యా చమురును ఆపివేయడం గురించి స్పష్టత ఇవ్వలేదు. రష్యా చమురు కొనుగోలు కారణంగా విధించిన అదనపు 25 శాతం పెనాల్టీ సుంకాన్ని తొలగించారని, అలాంటి కొనుగోళ్లను ఆపివేయడానికి భారత్ అంగీకరించిందని వైట్ హౌస్ అధికారి పేర్కొన్నారు. అయితే, మూడీస్ విశ్లేషణ ప్రకారం, భారత్ ఈ మార్పును నెమ్మదిగా అమలు చేస్తుంది, ఎందుకంటే తక్షణ మార్పు భారత్ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఈ ఒప్పందం ఆభరణాలు, రత్నాలు, టెక్స్‌టైల్ వంటి రంగాలలో భారత ఎగుమతులకు ప్రయోజనం చేకూరుస్తుంది, ఎందుకంటే అమెరికా భారత్‌కు అతిపెద్ద ఎగుమతి మార్కెట్. డీల్ ప్రకటన తర్వాత, స్టాక్ మార్కెట్లో జోరు కనిపించింది. నిఫ్టీ దాదాపు 3 శాతం పెరగగా, రూపాయి బలపడి డాలర్‌కు 90.40 వద్దకు చేరుకుంది. భారత్ వాణిజ్య శాఖ గడిచిన 12 నెలల్లో అత్యంత చురుగ్గా వ్యవహరించింది. అమెరికాతో కుదిరిన తాజా ఒప్పందానికి కొద్ది రోజుల ముందే భారత్, యూరోపియన్ యూనియన్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేసింది. ఒకే సంవత్సరంలో ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక శక్తులతో కుదుర్చుకోవడం భారత ఆర్థిక చరిత్రలో ఇదే తొలిసారి. వీటితోపాటు బ్రిటన్, ఓమన్, న్యూజిలాండ్‌తో కూడా భారత్ వాణిజ్య ఒప్పందాలను పూర్తి చేసుకుంది. ఈ ఐదు దేశాలు సహా భారత్‌కు చెందిన మొత్తం జీడీపీని లెక్కిస్తే అది ప్రపంచ మొత్తం జీడీపీలో సుమారు 50 నుంచి 55 శాతం వరకు ఉంటుంది. కేవలం భారత్, యూరోపియన్ యూనియన్ వాటానే ప్రపంచ జీడీపీలో 25 శాతంగా ఉంది. గణాంకాలు అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ ఎదుగుతున్న శక్తిని స్పష్టం చేస్తున్నాయి. ఈ ఒప్పందం భారత్‌కు పొరుగు దేశాలైన బంగ్లాదేశ్ వియత్నాం, థాయ్‌లాండ్‌లతో పోలిస్తే గొప్ప పోటీతత్వాన్ని కల్పించనుంది. ప్రస్తుతం అమెరికా విధించిన కొత్త నిబంధనల ప్రకారం... బంగ్లాదేశ్‌పై 20 శాతం, వియత్నాం 20 శాతం, థాయిలాండ్‌పై 19 శాతం టారిఫ్‌లు ఉన్నాయి. కానీ భారత్‌కు ఇది కేవలం 18 శాతానికి తగ్గడం వల్ల అమెరికా మార్కెట్‌లో భారతీయ వస్తువుల ధరలు తగ్గి గిరాకీ పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా ప్రథమ స్థానంలో ఉండగా, యూరోపియన్ యూనియన్ ద్వితీయ స్థానంలో ఉంది. భారత్ ఇప్పటికే ప్రపంచంలో నాల్గో అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా ఉంది. బ్రిట్ కూడా టాప్ -5 ఆర్థిక వ్యవస్థల జాబితాలో కొనసాగుతోంది. ఈ ప్రభావవంతమైన ఆర్థిక శక్తులన్నీ ఇప్పుడు భారత్‌తో దృఢమైన వాణిజ్య బంధాన్ని కలిగి ఉన్నాయి. ప్రపంచ మొత్తం వాణిజ్యంలో ఈ కూటమి వాటా 38 నుంచి 40 శాతం వరకు ఉన్నట్టు లెక్కలు చూస్తున్నాయి. ఇవే కాకుండా, భారత్ ఇప్పటికే జపాన్, దక్షిణ కొరియా, ఆసియాన్ దేశాలు, సార్క్ దేశాలు, మారిషస్, యూఏఈ , ఆస్ట్రేలియా వంటి దేశాలతో ప్రాంతీయ, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కలిగి ఉంది. తాజా ఒప్పందాలతో భారత తయారీ రంగం సేవా రంగానికి అంతర్జాతీయ మార్కెట్లు భారీగా అందుబాటులోకి రానున్నాయి. భారత్ తన వాణిజ్య విధానాల్లో చూపిస్తున్న ఈ దూకుడు ప్రపంచ దేశాలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. చైనా వంటి దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని చూస్తున్న పాశ్చాత్య దేశాలకు భారత్ ఇప్పుడు ఒక నమ్మకమైన, బలమైన ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. సుంకాల తగ్గింపు వ్యూహాత్మక భాగస్వామ్యాలు, స్థిరమైన ఆర్థిక వృద్ధి భారత్‌ను త్వరలోనే 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా నడిపిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదని నిపుణులు అంటున్నారు.

# కులగణనపై ఓబీసీల సందేహాలు

అసలే బీసీలను బీజేపీ ప్రభుత్వం పట్టించుకుంటోంది అంతంతమాత్రమే!! ఇప్పుడు జనగణనలో కులగణనను కేంద్రం చేస్తున్నప్పటికీ ఓబీసీ కాలం క్యాస్ట్ లేకపోవడం తీరని అన్యాయం. జాతీయ జనగణనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణన డాక్యుమెంట్‌లో ఎస్సీ, ఎస్టీల కాలమ్ పెట్టినప్పటికి ఓబీసీ కాలమ్ లేకుండా కులం అనే కాలమ్ మాత్రమే పెట్టి బీజేపీ ప్రజలను మోసం చేస్తోంది. దేశ జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు సరైన లెక్కలే లేవని, బీసీలకు అందాల్సిన రిజర్వేషన్ అందడం లేదు. ఇక తాజా కులగణనలో బీసీ కాలమ్ లేకపోవడం యావత్ బీసీ ప్రపంచానికే ప్రమాదకరం.. ఇప్పటికే బీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వారిని వాడుకుంటున్నారు.. 75 ఏళ్లుగా బీసీల కులగణన లేకపోవడం దురదృష్టకరం, 33 అంశాల్లో ప్రత్యేకంగా 'బీసీ కాలమ్' ఉండాలి. అన్ని వర్గాలకు న్యాయం జరగాలని అన్నారు. అందుకోసం కులగణనలో ఎస్సీ, ఎస్టీలలో పాటు బీసీలకు కాలమ్ ఉండాలి!

జనగణన 2021లో చేయాల్సి ఉండగా కొవిడ్ కారణంగా చేయలేదు. కులగణనపై అన్ని రాష్ట్రాల్లో డిమాండ్ రావటంతో కేంద్రం అందుకు అంగీకరించిందని స్పష్టంగా తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీల కాలం పెట్టి, ఓబీసీ అని లేకుండా కులం అనే కాలం మాత్రమే డాక్యుమెంట్‌లో పెట్టారు. బీసీల విషయంలో ఎంత గందరగోళం ఉంటుందో ఆలోచించాలి.. కుల గణన విషయంలో బీజేపీ మాట తప్పినట్టు స్పష్టంగా తెలుస్తోంది. కులగణలో కులం కేటగిరీతో పాటు సబ్ కేటగిరీ ఉండాలి. జనగణనలో బీసీలను మోసం చేసే కుట్ర జరుగుతోంది. కులాల పేర్లతో పంచాయితీ పెట్టి ప్రజలను విడదీయడమే వీరి ప్లాన్ అని అనిపిస్తోంది. 1953లో, 1979లో, 2017లో ఏర్పడిన బీసీ కమిషన్ల సిఫార్సులు అరకొరగానే అమలయ్యాయి. ఒక కమిషన్ గడువును 13 సార్లు పొడిగించినా ఇంతవరకు నివేదికను ప్రభుత్వానికి సమర్పించలేదు. 2011లో జరిగిన సామాజిక ఆర్థిక కుల గణన వివరాలు ఉన్నాయని చెప్పిన కేంద్రం ఆ వివరాలు ఎందుకో బయట పెట్టకుండా దాటవేసింది. దేశంలో సగానికి పైగా జనాభా ఉన్న బీసీల విషయంలో కేంద్రం లెక్కలేనితనం చూపడం దారుణమైనది. దేశంలో బీసీలు ఎంతమంది ఉన్నారు వీళ్ల ఆర్థిక స్థితి గతులేమిటి వీరి చదువులు ఎలా ఉన్నాయి వీరి ఉద్యోగ అవకాశాలేమిటి లాంటి విషయాలలో ఇప్పటి వరకూ ఓ క్లారిటీ లేదు.. పశువుల, వన్య ప్రాణుల లెక్కలను క్రమం తప్పకుండా తీసే ప్రభుత్వానికి, బీసీ లెక్కలు తీయాలన్న విజ్ఞతను కనబరచపోవడం అమానవీయం. బీసీలను పశువులకన్నా తక్కువ చేసి చూడడం దుర్మార్గం. దేశంలో మెజారిటీ ప్రజలైన బీసీల అభివృద్ధిని, సంక్షేమాన్ని గాలికి వదిలేసి మాది ప్రజారంజక ప్రభుత్వం అని చెప్పుకోవడం సిగ్గుచేటు. హక్కుల సాధనకు ఉద్యమించిన రైతులను జైళ్లపాలు చేశారు.. ఉద్యమకారులపై పి.డి., ఉగ్రవాద చట్టాలను అమలు చేశారు. ఇలాంటి చర్యలు గతంలో ఎప్పుడూ ఈ దేశంలోని ప్రజలు ఎదుర్కొలేదు. ఇప్పటికైనా బీసీల ప్రధాన డిమాండ్‌ను పూర్తి చేయడం కేంద్రానికి కూడా చాలా మంచిది. దేశంలో బీసీల జనాభా 70 కోట్లు, మొత్తం జనాభాలో ఇది 56% అని అంచనా. 90 ఏళ్ల నాటి డేటా ఆధారంగానే కొనసాగుతున్న రిజర్వేషన్లు.. కులాల లెక్కలతోనే బీసీల అసలు జనాభా తెలుస్తుంది. కుల గణన చేపట్టాలంటూ డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. పది సంవత్సరాలకు ఓ సారి దేశంలో జనాభాను లెక్కిస్తున్నా.. అందులో దళితులు, ఆదివాసీల సంఖ్య పైన మాత్రమే స్పష్టమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. అయితే జనాభాలో ఓబీసీతో పాటు ఏఏ కులాల వారు ఎంతమంది ఉన్నారన్న సమగ్ర సమాచారం సేకరించడం లేదు. దేశంలో బడుగు, బలహీన వర్గాలకు బీజేపీ పార్టీ దశాబ్దాలుగా తీవ్ర అన్యాయం చేస్తూనే ఉంది. సామాజిక న్యాయం పేరుతో మాటలు చెప్పే బీజేపీ, అధికారంలో ఉన్న చోట బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించ డంలో పూర్తిగా విఫలమైంది. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలంటే రిజర్వేషన్ల పెంపు తప్పనిసరి. ఈ విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన నిర్ణయం తీసుకుని అమలు చేయాలి.

# అడ్వర్టయింజింగ్ దిగ్గజం ఏజీకే



మానవులు పుడతారు. చనిపోతారు. కొంతమంది మాత్రమే తమ జీవితంలో మేథో మథనంతో, స్వయం కృషితో, ప్రజలకు గుర్తుండే, పనులు చేసి, చిరస్థాయిగా నిలిచి పోతారు. ప్రచార రంగంలో అలాంటి కృషి చేసి ప్రత్యేక గుర్తింపు పొందిన వ్యాపార దిగ్గజం ఎ.జి.కృష్ణమూర్తి. దేశంలోనే ప్రచార రంగంలో తనదైన ముద్ర వేసుకున్న 'ముద్ర' వ్యవస్థాపకుడు ఎ.జి.కృష్ణమూర్తి. ముద్రా కమ్యూనికేషన్స్ (ఓబీటతీజీ అనీఎఎబీనితిఇ-జీబితినీనిబ) సంస్థాపక అధ్యక్షుడు ఎ. జి. కృష్ణమూర్తి. కేవలం 35 వేల నగదు తో, ఒకే ఒక క్లయింట్ తో వ్యాపార ప్రకటనా సంస్థ స్థాపించి, కేవలం తొమ్మిదేళ్ళల్లో ముద్రా భారతదేశంలో ఉన్న పెద్ద వ్యాపార ప్రకటనా సంస్థలలో మూడవ స్థానాన్ని, స్వదేశీ వ్యాపార ప్రకటనా సంస్థలలో ప్రథమ స్థానాన్ని చేరుకునేలా కృషి చేశారు. ప్రభుత్వంలో చిన్న గుమస్థా ఉద్యోగంతో ప్రారంభించిన ఎ. జి. కె. తెలుగువారు గర్వించదగ్గ అతి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ధీరూభాయ్ అంబానీకి అతి చేరువలో ఉండి ఈ సంస్థని ఇంత త్వరగా ఉన్నత స్థాయికి లేవనెత్తి ఆయనచేత శభాష్ అనిపించు కున్నారు. ఎ.జి.కృష్ణమూర్తి (అచ్యుతాని గోపాల కృష్ణమూర్తి) 1942, ఏప్రిల్ 28న గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారు. అయన ముద్రా కమ్యూనికేషన్స్ సంస్థాపక అధ్యక్షులు. తెలుగువారు గర్వించదగ్గ వ్యాపార దిగ్గజం. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి చరిత్రలో బి.ఏ హానర్స్ పట్టా పుచ్చుకొని 1968లో 60, 70వ దశకాలలో వస్త్ర పరిశ్రమలో బాగా పేరున్న కాలికో మిల్స్ లో గిరాబెన్ సారాభాయికి సహాయకుడిగా చేరారు. 1972లో అదే కంపెనీకి చెందిన వ్యాపార ప్రకటన సంస్థ అయిన "శిల్పా అడ్వర్టైజింగ్" లో అకౌంట్ ఎగ్జిక్యూటివ్ గా పదోన్నతి పొందారు. 1976లో రిలయన్స్ సంస్థలకు ఆడ్వర్టైజింగ్ మేనేజరుగా చేరి, నాలుగు సంవత్సరాలు తిరక్కుండానే సొంత వ్యాపార ప్రకటనా సంస్థ "ముద్రా కమ్యూనికేషన్స్" ను 1980, మార్చి 25న స్థాపించారు. రిలయన్స్ సంస్థ ప్రధాన కార్యాలయంలో అడ్వర్టయిజింగ్ డైరెక్టర్‌గా చేరిన ఏజీకే అడ్వర్టయి జింగ్ రంగంలో శిఖర సదృశుడైన ఫ్రాంక్ సియాయిస్‌తో కలసి అద్భుతాలు చేశారు. రిలయన్స్ సంస్థ ఉత్పత్తి చేసిన సిల్కు చీరలూ, ఇతర దుస్తులకూ విమల్ బ్రాండ్‌తో ప్రకటనలు తయారు చేయడంలో ఫ్రాంక్ అనేక విన్యాసాలు చేశారు. 'ఓన్లీ విమల్' అన్నది అందరికీ, ఎప్పటికీ గుర్తు ఉండే సృజనాత్మక ప్రకటన. విమల్ కోసం తయారు చేసిన మొదటి అడ్వర్టయిజ్ మెంట్ ... "ఒక స్త్రీకి ఎన్నెన్నో మనోభావాలు". అడ్వర్టయిజ్ మెంటు రకరకాల రూపాలు సంతరించుకొని అత్యధికంగా పత్రికలలో, రేడియోలలో వచ్చి విమల్ చీరలకు అసాధారణమైన ఆదరణ తెచ్చింది. ఫ్రాంక్ సియాయిస్ సొంత ఏజెన్సీ పెట్టుకున్న తర్వాత, రిలయన్స్ ప్రత్యర్థులు ఆయన క్లయింట్లు అయిన కారణంగా రిలయన్స్ స్వయంగా ఒక అడ్వర్టయిజింగ్ ఏజెన్సీని నెలకొల్పాలనీ, దానికి 'ముద్ర' అని పేరు పెట్టాలనీ ఏజీకే చేసిన సూచనను ధీరూభాయ్ అంబానీ ఆమోదించారు. ఆయన రూ. 35 వేల నగదు తోను ఒకే ఒక క్లయింట్ తోను వ్యాపార ప్రకటనా సంస్థ స్థాపించారు. కేవలం తొమ్మిదేళ్ళల్లో ముద్రా భారత దేశంలో ఉన్న పెద్ద వ్యాపార ప్రకటనా సంస్థలలో మూడవ స్థానాన్ని, స్వదేశీ వ్యాపార ప్రకటనా సంస్థలలో ప్రథమ స్థానాన్ని చేరుకుంది. 1980లో ముద్ర వెలిసింది. ఒక వెలుగు వెలిగింది. కార్పొరేట్ రంగంలో "అడ్వర్టయింజింగ్ జీనియస్"గా ఏజీకే గుర్తింపు పొందారు. దేశ వ్యాప్తంగా విమల్ షోలు నిర్వహించి విమల్ విజయ పరంపరను కొనసాగించడంలో ఏజీకేది అద్వితీయమైన పాత్ర. 'ఐ లవ్ యూ రస్నా' కూడా ఆయన సృష్టే. ప్రభుత్వంలో చిన్న గుమస్థా ఉద్యోగంతో ప్రారంభించిన ఎ. జి. కె. తెలుగువారు గర్వించదగ్గ అతి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ధీరూభాయ్ అంబానీకి అతి చేరువలో ఉండి ఆ సంస్థను అంత త్వరగా ఉన్నత స్థాయికి లేవనెత్తి ఆయన చేత శభాష్ అనిపించు కున్నారు. ఆయన తమ అనుభవాలను పుస్తకాల రూపంలోనూ, పత్రికా శీర్షికల ద్వారా రాసి యువతను ఉత్తేజ పరిచారు. కృష్ణమూర్తి తెలుగు పత్రికలో వారం వారం అనే శీర్షికను, ఆంగ్ల పత్రికలలో ఏజికె స్పీక్ (ఒఉఐ ాజూవజీని) అనే శీర్షికను రాశారు. ఆయన 'ధీరూభాయిజమ్' అనే పేరుతో తెలుగులో, ఇంగ్లీష్‌లో పుస్తకం రాశారు. 'ఎదురీత' పేరుతో మరో పుస్తకం రాశారు. వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసే ఆయన రచనలను వివిధ భారతీయ భాషలలోకి అనువదించారు. 'ఇదండీ నా కథ' అనేది ఏజీకే ఆత్మకథ. అదే ఆయన చివరి రచన. అంచెలంచెలుగా ఎదుగుతూ యాడ్స్ రంగ దిగ్గజ వ్యక్తుల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్న కృష్ణమూర్తి తెలుగు, ఆంగ్లంలో 15కు పైగా పుస్తకాలు రచించారు. 2013లో ఇఫ్ యు కెన్ డ్రీమ్ పేరుతో తన ఆత్మకథను పుస్తక రూపంలో విడుదల చేశారు. ముద్రా కమ్యూనికేషన్స్ చైర్మన్‌గా పదవీ విరమణ చేసిన తర్వాత ఎ.జి.కె. బ్రాండ్ కన్సల్టింగ్‌ను స్థాపించారు. కాలమిస్టుగా, రచయితగా ఆంగ్లంలోనూ, తెలుగులోనూ పలు వ్యాసాలు, పుస్తకాలు ప్రచురించారు. ఆయన పుస్తకాలు అతి కొద్దికాలంలో పలు భారతీయ భాషల్లో ప్రచురింపబడి, ఎంతో మందికి స్ఫూర్తినిచ్చి ఒక కొత్త ఒరవడిని సృష్టించాయి. ఆయన 73వ యేట ఫిబ్రవరి 5, 2016న హైదరాబాదులో మరణించారు.

# కళారంగ ఘనాపాఠి గరికపాటి



కళలు సామాజిక ప్రగతికి దోహదం చెయ్యాలని, జనాన్ని చైతన్య స్ఫూర్తితో ముందుకు నడిపించాలని, అందుకు కళలు కరదీపికలు కావాలని ప్రతికరణ శుద్ధిగా నమ్మి ఆ లక్ష్య సాధనకు జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి గరికపాటి రాజారావు. కళ ప్రజాచైతన్యం కోసమేనని నమ్మి, జీవితాన్ని కళకే అంకితం చేసిన ప్రజా కళాకారుడు, ప్రజావైద్యుడు రాజారావు. నాటకరంగం ద్వారా ప్రజాకళా రంగానికి దిక్సూచిగా నిలచిన వైతాళికుడు డాక్టర్ గరికపాటి రాజారావు. తెలుగు నాటక రంగంలో అతి నవీన భావాలతో వినూత్న విలువలను ఆవిష్కరించి తెలుగు నాటక దశను, దిశను మార్చి సామాన్య ప్రజల సాంస్కృతిక సైనికుడిలా నిలచిన కళాస్రష్ట ఆయన. ప్రముఖ నటీనటులు జమున, అల్లు రామలింగయ్యను వెండితెరకు పరిచయం చేసిన ఘనత ఆయనదే. గరికపాటి రాజారావు (ఫిబ్రవరి 5, 1915 – సెప్టెంబరు 8, 1963) తెలుగు సినిమా దర్శకుడు, నాటకరంగ ప్రముఖుడు, ఆంధ్ర ప్రజానాట్య మండలి వ్యవస్థాపకులు. ప్రజానాట్య మండలి సాంఘిక నాటకాలకు పెద్దపీట వేసింది. ఈ నాటక సంఘం ద్వారా అనేకమంది ప్రతిభా వంతమైన కళాకారులు పరిచమయ్యారు. చెప్పికోదగిన వారిలో దేవిక, అల్లు రామలింగయ్య, సంగీత దర్శకులు మోహన్ దాస్, టి.చలపతిరావులు, నృత్యదర్శకుడు వేణుగోపాల్, రచయితలు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ ఉన్నారు. రాజారావు 1915 ఫిబ్రవరి 5వ తేదీన రాజమండ్రిలో గరికపాటి కోటయ్య, దేవరా రామలింగమ్మల దంపతులకు జన్మించారు. చిన్నప్పుడే కాకినాడలోని ఆదిభట్ల నారాయణదాసు హరికథకు వెళ్లి, పాటకు తగిన తాళం వేసి తన ప్రతిభను నిరూపించుకుని అభినందనలు పొందారు. చదువు కుంటున్న రోజుల్లో విచిత్ర వేషధారణలో ఆసక్తి చూపించిన రాజారావు, హరిశ్చంద్ర నాటకంలోనూ ఓ వేషం ధరించి పాఠశాల అధ్యాపకుల మెప్పు పొందారు. తరువాత విజయ నగరంలో మేనమామ సుబ్రహ్మణ్యం ఇంట చేరి ఎస్ఎస్ఎల్‌సి పూర్తి చేశారు. రాజారావుకు 15వ ఏటనే నాగేశ్వరమ్మతో వివాహం జరిగింది. తండ్రి ఉద్యోగం చేసిన సికిందరా బాదు లాలాగూడ వర్క్‌షాపులో చిన్న గుమాస్తాగా జీవనం సాగిస్తూ, పై ఉద్యోగి పీడన భరించలేక దానికి రాజీనామా చేసి 1937లో మద్రాసు చేరారు. మద్రాసులో ఎల్.ఐ.యం చదువుతున్న రోజులో పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి (పుచ్చలపల్లి సుందరయ్య సోదరుడు) డాక్టర్ రామదాసు ఆయనకు ప్రాణ స్నేహితులు. అలాంటి స్నేహ వాతావరణ ప్రభావం వలన రాజారావు మార్క్సిస్టు రాజకీయ ఉద్యమాలవైపు ఆకర్షితులయ్యారు. మద్రాసలో చదువుతున్నప్పుడే సహ విద్యార్థులతో కలిసి గుళ్లపల్లి నారాయణ మూర్తి రచించిన విడాకులు నాటకానికి దర్శకత్వం వహించాడు. మద్రాసులో రాజారావు దర్శకత్వంలో ప్రదర్శించిన షాజహాన్ నాటకం సంచలనాన్ని సృష్టించింది. షాజహాన్‌గా ఎస్వీఆర్ సాంబశివరావు, జహనారాగా డాక్టర్ కొర్రపాటి గంగాధరరావు, ఔరంగజేబుగా రాజారావు అద్భుతంగా నటించి పలువురి ప్రశంసలు పొందారు. ఆ నాటకంలో రాజారావుకు సుప్రసిద్ధ నటుడు రూపశిల్పి దేవీప్రసాద్ రాయ్ చౌదరి మేకప్ చేయడం విశేషం. మద్రాసులో విద్యార్థులను సమీకరించి భమిడిపాటి బాగుబాగు, గాలి బాల సుందరరావు అపోహ వంటి నాటకాలను ప్రదర్శించారు. వృత్తి రీత్యా వైద్యుడైన రాజారావు ఉచితంగా వైద్య సేవలు అందించడానికి విజయవాడలోని పోరంకిలో ప్రజా వైద్యశాల నెలకొల్పి ఫీజులు తీసుకోకుండా మందులు కూడా తనే కొనుగోలు చేసి ఉచితంగా రోగులకు సేవ చేసేవారు. కొంతకాలం రాజమండ్రి లోనూ ప్రజావైద్యశాల నిర్వహించారు. రాజారావు 1953లో పుట్టిల్లు సినిమాను స్వయంగా నిర్మించి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో ప్రముఖ నటీనటులు జమున, అల్లు రామలింగయ్యను వెండితెరకు పరిచయం చేశారు. పుట్టిల్లు సినిమాలో వివిధ నటులు తమ నటనకు ప్రశంసలందుకున్నా ఈ సినిమా ఆర్థికంగా లాభించ లేదు. దానితో రాజారావు ఆర్థికంగా దెబ్బతిని అప్పుల పాలయ్యారు. కానీ వృత్తిరీత్యా వైద్యుడైన రాజారావు సంఘసేవ మాత్రం ఆపలేదు. ఒక్క రూపాయికి వైద్యం చేసిన సేవా తత్పరులు. పేదవారికి ఉచితం వైద్యం చేస్తుండేవారు. ఆ తరువాత ఈయన 1962లో విడుదలైన ఆరాధన వంటి సినిమాల్లో చిన్నాచితక పాత్రలు కూడా పోషించారు. ఆరాధనలో రాజశ్రీకి తండ్రి షావుకారు పాత్ర వేశారు. జైభవానీ నాటకాన్ని ప్రదర్శించే సమయంలో గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థులయ్యారు. అదే సమయంలో దేవుడుచేసిన మేలు చిత్రాన్ని నిర్మించినా ఆర్థిక కారణాలవల్ల ఆ చిత్రం విడుదల కాలేదు. మానసికంగా కుంగిపోయిన రాజారావు 1963 సెప్టెంబరు 8న మద్రాసులో మరణించారు.



# వారానికి ఒక్క పెగ్ వేసినా రిస్క్ తప్పదా?

ఒక్క పెగ్ వేస్తే ఆరోగ్యం బాగుంటుందని చాలా మంది నమ్ముతుంటారు. కానీ, డాక్టర్ ఎర్నెస్ట్ హాక్ వంటి నిపుణులు మాత్రం వారానికి ఒక్క డ్రింక్ తీసుకున్నా అది ప్రమాదకరమే.. మద్యం విషయంలో సురక్షితమైన పరిమితి అంటూ ఏదీ లేదు అని కుండబద్దలు కొడుతున్నారు. అమెరికాలో 2019లో నమోదైన 1.8 మిలియన్ క్యాన్సర్ కేసుల్లో సుమారు లక్ష కేసులు మద్యం వల్లే సంభవించాయి. పొగాకు, రేడియేషన్, ఆస్బెస్టాస్.. వీటి వల్ల క్యాన్సర్ వస్తుందని అందరికీ తెలుసు. కానీ, ఆల్కహాల్ కూడా అదే స్థాయి ప్రమాదకరమైన 'కార్సినోజెన్' (క్యాన్సర్ కారకం) అని చాలా మందికి తెలియదు. అమెరికాలో జరిగిన తాజా సర్వే ప్రకారం, సగం మంది అమెరికన్లకు మద్యం వల్ల క్యాన్సర్ వస్తుందనే విషయమే తెలియదు. కానీ, వైద్య శాస్త్రం మాత్రం మద్యం సేవించడం వల్ల ఏడు రకాల క్యాన్సర్ల ముప్పు స్పష్టంగా పెరుగుతుందని హెచ్చరిస్తోంది. అసిటాల్డిహైడ్ : శరీరం మద్యాన్ని విచ్ఛిన్నం చేసినప్పుడు 'అసిటాల్డిహైడ్' అనే విష పదార్థం తయారవుతుంది. ఇది మన కణాలలోని డీఎన్ఏ, ప్రోటీన్లను దెబ్బతీస్తుంది. ఫలితంగా కణాలు అదుపు తప్పి పెరిగి క్యాన్సర్‌కు దారితీస్తాయి. ఫ్రీ రాడికల్స్ ఉత్పత్తి: మద్యం సేవించడం వల్ల శరీరంలో హానికరమైన 'ఫ్రీ రాడికల్స్' పెరుగుతాయి. ఇవి శరీరంలో ఇన్ఫ్లమేషన్ (మంట) కలిగించి డీఎన్ఏను నాశనం చేస్తాయి. హార్మోన్ల అసమతుల్యత: ఆల్కహాల్ వల్ల శరీరంలో ఈస్ట్రోజెన్ హార్మోన్ స్థాయిలు పెరుగుతాయి. దీనివల్ల ముఖ్యంగా మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే ముప్పు గణనీయంగా పెరుగుతుంది. పోషకాల గ్రహణశక్తి దెబ్బతినడం: మద్యం వల్ల విటమిన్లు, పోషకాలను శరీరం గ్రహించలేకపోతుంది, ఇది రోగనిరోధక శక్తిని తగ్గించి క్యాన్సర్‌కు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది. మద్యం ప్రభావం పురుషుల కంటే మహిళలపై ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.మహిళల్లో: వారానికి ఒక డ్రింక్ కంటే తక్కువ తీసుకునే వారిలో క్యాన్సర్ ముప్పు 16% ఉంటే, రోజుకు ఒక పెగ్ వేసే వారిలో అది 19% కి, రెండు పెగ్గులు తీసుకునే వారిలో 22% కి పెరుగుతుంది. పురుషుల్లో: ఈ ముప్పు వరుసగా 10%, 11%, 13% గా ఉంటుంది. మహిళల శరీర బరువు తక్కువగా ఉండటం మరియు మద్యాన్ని అరిగించే ఎంజైములు తక్కువగా ఉండటం వల్ల వారు త్వరగా క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉంది.



# కీళ్లు నొప్పులుగా ఉన్నాయా?

ఉరుకుల పరుగుల జీవితంలో రక్తపోటు, అధిక బరువు, కీళ్ల నొప్పులు నిద్రలేమి వంటి సమస్యలు ప్రతి ఒక్కరినీ వేధిస్తున్నాయి. వీటన్నింటికీ మందుల షాపుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, మన ఆయుర్వేదంలో అద్భుతమైన పరిష్కారం ఉంది. అదే అశ్వగంధ. దీనిని 'ఇండియన్ జిన్సెంగ్' అని కూడా పిలుస్తారు. శరీరానికి గుర్రపు వేగాన్ని, శక్తిని ఇచ్చే గుణం దీనికి ఉండటం వల్లే దీనికి ఆ పేరు వచ్చింది. అశ్వగంధను టీ రూపంలో తీసుకోవడం వల్ల కలిగే లాభాలను ఆయుర్వేద నిపుణులు వివరిస్తున్నారు. అశ్వగంధ కేవలం ఒక మూలిక మాత్రమే కాదు, అది శరీరంలోని హార్మోన్లను క్రమబద్ధీకరించే ఒక శక్తివంతమైన ఔషధం. ఒత్తిడిని తగ్గించే కార్టిసాల్ నియంత్రణ నుండి, పురుషుల్లో టెస్టోస్టెరాన్ స్థాయిలను పెంచడం వరకు ఇది ఎంతో మేలు చేస్తుంది. దాల్చిన చెక్క, అల్లం, యాలకులు కలిపి తయారు చేసే ఈ టీ రుచిలోనే కాదు, ఆరోగ్య ప్రయోజనాల్లోనూ సాటిలేనిది. రోగనిరోధక శక్తి : చలికాలంలో మారుతున్న సీజన్లలో వచ్చే జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలను ఎదుర్కోవడానికి ఇది శరీరానికి అవసరమైన బలాన్ని ఇస్తుంది. ఒత్తిడి ఆందోళన: శరీరంలో ఒత్తిడిని కలిగించే 'కార్టిసాల్' హార్మోన్‌ను ఇది అదుపులో ఉంచుతుంది. దీనివల్ల మానసిక ప్రశాంతత చేకూరి, ఆందోళన తగ్గుతుంది. బరువు నియంత్రణ: అశ్వగంధ టీ శరీర మెటబాలిజంను (జీవక్రియ) వేగవంతం చేస్తుంది. దీనివల్ల కొవ్వు నిల్వలు కరిగి, బరువు తగ్గడం సులభమవుతుంది. కీళ్ల నొప్పులు: ఇందులోని 'యాంటీ ఇన్ఫ్లమేటరీ' గుణాలు ఆర్థరైటిస్ మరియు కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తాయి. కీళ్లలో దృఢత్వాన్ని తగ్గించి నడకను సులభతరం చేస్తుంది. మంచి నిద్ర: నిద్రలేమి సమస్యతో బాధపడేవారు ఈ టీని క్రమం తప్పకుండా తీసుకుంటే నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది.

# అమ్మాయిలకు ఇది అమృతం?



ఆడవాళ్ళు ఎప్పుడూ ఏదోక సమస్యతో ఇబ్బంది పడుతూనే ఉంటారు. అయితే, వాటిని తగ్గించుకోవడం కోసం హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతూనే ఉంటారు. వాటిలో ప్రధాన సమస్య కాళ్ళ పగుళ్ళు. ఒక్క రూపాయి కూడా లేకుండా మీ ఇంట్లో ఉండే వాటితోనే ఇక్కడ చెప్పిన చిట్కాతో తగ్గించుకోండి. చలి కాలం రాగానే చాలా మంది అమ్మాయిలకు చర్మం పొడిబారడం, కాళ్ళ పగుళ్లు రావడం వంటివి జరుగుతుంటాయి. అయితే, వీటిలో 'కాళ్ల పగుళ్లు' సమస్య ఎంతో మందిని వేదనకు గురి చేస్తుంది. నడిచేటప్పుడు కూడా కొంచం ఇబ్బందిగా ఉంటుంది. అయితే, దీని నుంచి బయటపడటానికి ఎన్నో క్రీములు వాడుతారు. అయినా కూడా ఎలాంటి ఉపయోగం ఉండదు. దాని కంటే మీ ఇంట్లో ఉండే వాటితోనే ఈ సమస్యకు గుడ్ బై చెప్పొచ్చు. తయారీ విధానం: పల్లీల పొట్టును ఒక గిన్నెలోకి తీసుకుని గ్రైండ్ చేయాలి. ఆ తర్వాత దీనిలో ఒక టీ స్పూన్ కొబ్బరి నూనె, తేనె వేసి మిక్స్ చేయాలి. ఆ తర్వాత దీనిలో కొద్దిగా పాలు పోసి పేస్ట్ లా చేయాలి. మీ పాదాలను ముందుగా నీటితో శుభ్రపరచి.. ఆ తర్వాత ఈ పేస్ట్‌ను పగుళ్లు ఉన్న ప్రదేశంలో రాసి 10 నిముషాల పాటు ఉంచి నీటితో శుభ్ర పరచుకోండి. ఇలా చేసిన తర్వాత రక్తప్రసరణ కూడా మెరుగుపడి పగుళ్లు తగ్గుతాయి. అమ్మాయిల్లో ఎవరైతే ఈ కాళ్ళ పగుళ్ళ వల్ల బాధ పడతారో వాళ్ళు వారంలో రెండు సార్లు ఇలా చేస్తే, మీ పాదాలు మెత్తగా అవుతాయి. ఖరీదైన క్రీములు వాడే కంటే, ఇంట్లో ఉండే వాటితోనే సులభంగా వాడుకోండి.

# పరగడుపున అరటి పండును తినొచ్చా?



అరటి పండులో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఇది మన శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. అలాగే, దీని వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అయితే, చాలా మంది దీనిని పరగడుపున తీసుకుంటారు. ఇలా తీసుకోవడం మంచిదేనా? ఏమైనా అనారోగ్య సమస్యలు వస్తాయా? మనలో చాలా మంది అరటి పండును పరగడుపున తింటారు. అయితే, అసలు ఇలా తినొచ్చా? లేదో అని కూడా తెలుసుకోకుండా తినేస్తారు. పరగడుపున అరటి పండును తీసుకుంటే.. అది సరిపోను శక్తినివ్వదని వైద్యులు చెబుతున్నారు. ఇంకా ఇది ఆ సమయంలో ఐరన్ ను గ్రహించ లేదు. దీని వలన ఇమ్యూనిటీ పవర్ కూడా తగ్గిపోతుంది. ఇక బరువు తగ్గాలనుకునే వారు దీనిని ఎక్కువగా తీసుకోకూడదు. బనానాలో క్యాలరీలు చాలా తక్కువ ఉంటాయి. దీనిని తీసుకున్న గంటకే ఆకలి వేస్తుంది. ఇక ఏదోకటి తినేస్తారు. ఆ తర్వాత బరువు కూడా అమాంతం పెరుగుతారు. అరటి పండులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇంకా ఇది కడుపు నొప్పిని కూడా తీవ్రతరం చేస్తుంది. కాబట్టి, అరటి పండును ఎక్కువగా తీసుకోకపోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు. పరగడుపున తీసుకుంటే అరటి పండ్లను తీసుకుంటే గ్యాస్, ఎసిడిటీ ఎక్కువ అవుతుంది. దీని వలన మగ వారికీ, ఆడ వాళ్ళకి జీర్ణ సంబంధిత సమస్యలు కూడా వస్తాయి. (ఔపుఇ: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నానేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది) పరగడుపున తీసుకుంటే అరటి పండ్లను తీసుకుంటే గ్యాస్, ఎసిడిటీ ఎక్కువ అవుతుంది. దీని వలన మగ వారికీ, ఆడ వాళ్ళకి జీర్ణ సంబంధిత సమస్యలు కూడా వస్తాయి.



# పసుపులో ఆ రెండు కలిపితేనే అది పవర్ ఫుల్

పసుపును మనం సహజమైన యాంటీబయాటిక్ అని, గొప్ప యాంటీ ఇన్ఫ్లమేటరీ అని నమ్ముతాం. కానీ, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ పూజా రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. మనం పసుపును విడిగా తీసుకుంటే అందులోని ప్రయోజనాలు శరీరానికి 1% కూడా అందవు. పసుపులోని ప్రధాన సమ్మేళనమైన 'కర్కుమిన్'ను గ్రహించే శక్తి మన శరీరానికి చాలా తక్కువగా ఉండటమే దీనికి కారణం. మనం పసుపు తిన్న వెంటనే మన కాలేయం (ఒతిలవతీ) దానిని రక్తంలోకి చేరకముందే విచ్ఛిన్నం చేసి బయటకు పంపిస్తుంది. పసుపు తన పూర్తి స్థాయి ప్రభావాన్ని చూపించాలంటే దానికి తోడుగా కొన్ని పదార్థాలు అవసరమని సైన్స్ చెబుతోంది. డాక్టర్ పూజా రెడ్డి తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో పసుపు గ్రహణశక్తిని పెంచే మార్గాలను వివరించారు. మన అమ్మమ్మల కాలం నాటి పసుపు, మిరియాల పొడి నెయ్యి కాంబినేషన్ వెనుక ఉన్న అసలు రహస్యం ఇప్పుడు ఆధునిక వైద్య పరిశోధనల్లో కూడా నిరూపితమైంది. కేవలం ఒక చిటికెడు మిరియాల పొడి చేర్చడం వల్ల పసుపు పనితీరు 20 రెట్లు పెరుగుతుందని ఆమె చెబుతున్నారు. ఆ వివరాలేంటో ఇప్పుడు చూద్దాం. మిరియాల పొడి : పసుపును మిరియాల పొడితో కలిపి తీసుకుంటే, శరీరంలో దాని గ్రహణశక్తి ఏకంగా 100 శాతం పెరుగుతుంది. మిరియాల్లో ఉండే 'పైపెరిన్' అనే పదార్థం, లివర్ కర్కుమిన్‌ను విచ్ఛిన్నం చేయకుండా అడ్డుకుంటుంది. దీనివల్ల పసుపు నేరుగా రక్తంలోకి ప్రవేశిస్తుంది. కొవ్వు పదార్థాలు : కర్కుమిన్ నీటిలో కరగదు, కేవలం కొవ్వులో మాత్రమే కరుగుతుంది. కాబట్టి పసుపును నెయ్యి లేదా కొబ్బరి నూనె వంటి ఆరోగ్యకరమైన కొవ్వులతో కలిపి తీసుకున్నప్పుడు మాత్రమే అది శరీరానికి అందుతుంది.

ప్రాచీన విజ్ఞానం: అందుకే మన పెద్దలు పసుపును కూరల్లో నూనెతో వేయించడం లేదా పాలలో నెయ్యి, మిరియాల పొడి వేసి ఇచ్చేవారు. ఈ మూడు కలిసినప్పుడు అది ఒక శక్తివంతమైన ఔషధంగా మారుతుంది. ఇకపై పసుపు పాలు తాగినా లేదా కూరల్లో వాడినా, అందులో ఒక చిటికెడు మిరియాల పొడి కొద్దిగా నెయ్యి ఉండేలా చూసుకోండి. అప్పుడే పసుపులోని అసలైన యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు మీ చర్మానికి, ఆరోగ్యానికి అందుతాయి.

# తెలంగాణ ఉద్యోగుల జెఏసిలో చీలిక

**జేఏసిలో ముఖ్య సంఘాలైన టిజిఓ, టిఎన్జీఓల మధ్య వి భేదాలు ముదరడంతో ఈ జేఏసిలో చీలిక**

**జేఏసి మనుగడ ప్రశ్నార్థకం.. ఉద్యోగ సంఘాల నాయకులు ఆందోళన**

**హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యోగుల జేఏసిలో (టిజిఈజేఏసీ) చీలిక రావడంతో ఉ ద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ జేఏసి లో ముఖ్య సంఘాలైన టిజిఓ, టిఎన్జీఓల మధ్య వి భేదాలు ముదరడంతో ఈ జేఏసిలో చీలిక తప్పదని ఉద్యోగసంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఇ ప్పటికే ఈ రెండు సంఘాల మధ్య ఆధిపత్య పోరు మొదలయ్యింది. ఈ నేపథ్యంలోనే ఈ జేఏసీలోని మిగతా సంఘాలు నాయకులు కూడా వీరిద్దరిని క లపడానికి ప్రయత్నించడం లేదని దీంతో వీరి మ ధ్య మనస్పర్ధలు ఎక్కువయ్యాయని సమాచారం. ప్రస్తుతం ఈ రెండు సంఘాల మధ్య మనస్పర్ధల నేపథ్యంలో ఈ జేఏసి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఉద్యోగ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా టిజిఓ, టిఎన్జీఓల ఆధిపత్య పోరు అధికం కావడంతో ఈ మధ్య జేఏసి వాట్సాప్ గ్రూపు నుంచి టిఎన్జీఓ సంఘం నాయకులు ఎగ్జిట్ అయ్యారు. అప్పటి నుంచి ఈ రెండు సంఘాల నాయకులు అంటీముట్టనట్టుగా వ్యవహారించడంతో పాటు కనీసం జేఏసి సమావేశాన్ని సైతం నిర్వహించ లేదు. అయితే, ఈ విషయమై ఇరు సంఘాల నాయకులు ఉద్యోగులకు వేర్వేరు కారణాలు చెబుతుండడంతో అసలు తప్పు ఎవరిది, ఎందుకు వీరి మధ్య ఆధిపత్య పోరు మొదలయ్యిందన్న విషయాల గురించి ఉద్యోగులు ఆరా తీస్తున్నారు.

206 సంఘాలతో జేఏసి స్టీరింగ్ కమిటీ

అయితే టిజిఓ, టిఎన్జీఓ సంఘాల నాయకులు (టిజిఈజేఏసీ) పేరుతో ఉద్యోగుల జేఏసిని ఏర్పాటు చేయడం కొన్ని రాజకీయ పార్టీలకు ఇష్టం లేక వీరి మధ్య రాజకీయ నాయకులే చిచ్చు పెట్టారని పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నా రు. 206 సంఘాలతో తెలంగాణ ఉద్యోగుల జేఏసి స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయగా ఈ జేఏసి చైర్మన్‌గా మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్‌గా ఏలూరి శ్రీనివాసరావులను ఉద్యోగ సంఘాల నాయకులు ఎన్నుకున్నారు. ఈ జేఏసి స్టీరింగ్ కమిటీలో 27 ఉద్యోగ సంఘాల నాయకులకు సైతం చోటు కల్పించారు. అయితే, ఈ జేఏసిలో ప్రభుత్వ గుర్తింపుపొందిన 9 ఉద్యోగ సంఘాలైన టిఎన్జీఓ, టిజిఓ, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం, టిఆర్‌టి యూ, యూటిఎఫ్, ఎస్‌టియూ, టిఆర్‌టిఎఫ్ సం ఘాలతో పాటు టీచర్లు, లెక్చరర్లు, ఉపాధ్యాయ సంఘాలైన ఈఎస్‌పిసి, టిటిజేసి, జాక్టో, టిఏజేఏసి తదితర సంఘాలు ఇందులో భాగస్వామయ్యా యి. వీటితో పాటు పెన్షనర్‌ల సంఘాలు సైతం ఈ జేఏసికే మద్ధతు ప్రకటించాయి. దీంతో ఈ జేఏసికి సుమారుగా 206 ఉద్యోగ సంఘాలు మద్ధతు ప్రకటించడంతో మొత్తంగా 3 లక్షల ఉద్యోగులతో పాటు 3,50,000 లక్షల పెన్షనర్‌ల మద్ధతు ల భించింది. అయితే, ఈ జేఏసిలో మొదటి నుంచి ఒ క నాయకుడంటే మరో నాయకుడికి గిట్టడం లేదు. జేఏసిలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నా వెంటనే దానిని లీక్ చేస్తున్నారని ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం విశేషం. గతంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం ప్రభుత్వ ఉద్యోగులు తమ సం ఘాలతో జేఏసిని ఏర్పాటు చేసుకొని అప్పటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకోవడంలో సఫలీకృత మయ్యాయి. 2014 నుంచి 2023 నవంబర్ వరకు సుమారు 10 ఏళ్ల పాటు తమ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని అధికారంలో ఉన్న అప్పటి ప్రభుత్వానికి టిఎన్జీఓ, టిజిఓ, రెవెన్యూ, టీచర్ల సంఘాలు పలుమార్లు వినతిపత్రాలను ఇచ్చి కొంతమేర తమ సమస్యలను పరిష్కరించుకున్నాయి. అయితే, ప్రస్తుతం రాష్ట్రం లో డిసెంబర్ 2023న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం సిఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన తరువాత ఉద్యోగ సంఘాల నాయకులు మారిపోవడంతో కొత్తగా 206 ఉద్యోగ సంఘాలతో ఈ జేఏసిని ఏర్పాటు చేసుకొని సమస్యల సాధన కోసం పోరాడుతున్నాయి.

# రేవంత్ బినామీలపై విచారణ చేయాలి

**హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డికి చెందిన బినామీ కంపెనీ బాగోతం, ఆయన చేసిన ఫ్రాడ్ ప్రజలకు తెలియకుండా దాచిపెట్టడానికి బీఆర్ఎస్ నేతలకు వరుస నోటీసులు ఇచ్చారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సీబీఐ దర్యాప్తునకు ఎన్సీఎల్టీ ఆదేశించిన కేఎల్ఎస్ఆర్ కంపెనీకి తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టులు ఎందుకు ఇచ్చిందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అక్రమ సంపాదన కోసమా, లేక బినామీ కంపెనీకి ప్రాజెక్టుల కోసమా, కమిషన్ల కోసమా అని కేటీఆర్ నిలదీశారు. దీనిమీద సీబీఐ, ఈడీ రంగంలోకి దిగి విచారణ చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. న్యాయమూర్తిని సైతం ప్రలోభపెట్టాలని చూశారని పేర్కొన్నారు. బినామీ కంపెనీ కాకపోతే నిషేధం ఉన్న కంపెనీకి రేవంత్ రెడ్డి ప్రాజెక్టులు ఎలా కట్టబెట్టారని, ఆయన పాత్ర ఏంటో తేలాలన్నారు.తెలంగాణ భవన్‌లో బుధవారం నాడు కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ అంటూ సంచలన ఆరోపణలు చేశారు. 'మూసీ అభివద్ధి పేరుతో 1.5 లక్షల కోట్ల దోపిడీని అడ్డుకున్నది బీఆర్ఎస్, లగచర్లలో తన సొంత అల్లుడి కంపెనీ కోసం ఫార్మా సిటీ పేరుతో గిరిజనుల మీద దాడి చేస్తే స్కాంను బయటపెట్టింది తామేనన్నారు. హెచ్‌ఐఎల్‌టీ పేరుతో రూ.5 లక్షల కోట్ల భూ భాగోతాన్ని బయటపెట్టాం, సీఎం రేవంత్ రెడ్డి బావమరిది అమృత్ లో చేసిన స్కాంను బయటపెట్టాం. ఇటీవల సింగరేణి బొగ్గుగనుల్లో కాంగ్రెస్ మోసాలను బయటపెట్టింది బీఆర్ఎస్ పార్టీ అని కేటీఆర్ అన్నారు. ఇలాంటి స్కాంలు, కుంభకోణాలు బయటపెడుతున్నందున జనవరి 22, 23 తరువాత మొదట హరీష్ రావు, తరువాత నాకు, సంతోష్ కుమార్, పార్టీ అధినేత కేసీఆర్ కు వరుస నోటీసులు ఇచ్చి సిట్ విచారణకు పిలవడంతో మాకు అనుమానం వచ్చింది. అన్ని విషయాలు గమనిస్తే సీఎం రేవంత్ రెడ్డి బినామా బాగోతం బయటపడింది. జనవరి 23న సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. ఐబాఖీ ఇన్‌ఫ్రా అనేది రేవంత్ రెడ్డి బినామీ



కంపెనీ. మాతో ఆధారాలున్నాయి. దివాళా తీసిన కంపెనీ ఐపీ ప్రొఫెషనల్స్ లేకుండా రూ.6 వేల కోట్ల పనులకు కాంట్రాక్టులు ఎలా వచ్చాయని చూస్తే తెలంగాణలో వచ్చాయి. ఆయన చీఫ్ మినిస్టర్ కాదు, బినామీ చీఫ్ మినిస్టర్ అని అందరికీ తెలుసు. ఈరోజు ఆయన బినామీ మాస్టర్ అని తేలిపోయింది. బ్లాక్ మెయిల్ చేసి గతంలో సంపాదించిన డబ్బును ఆయన బినామీ కంపెనీలకు తరలిస్తున్నాడు. వేల కోట్ల ప్రాజెక్టులను కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ సహా పలు ప్రాజెక్టులు కట్టబెట్టారు. 2018 సెప్టెంబర్ 27న రేవంత్ రెడ్డి, ఆయన బంధువుల మీద ఐటీ రైడ్స్ జరిగాయి. ఆయన బావమరిది కంపెనీ సాయి మౌర్య ఎస్టేట్స్ వాళ్లు ట్యాక్స్ సరిగ్గా కట్టలేదని ఐటీ తెలిపింది. కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కంపెనీ రేవంత్ దని ఇది ఒక ప్రూఫ్. రేవంత్ రెడ్డి తిరుగుతున్న ల్యాండ్ క్రూజర్ కార్ నెంబర్ టీఎస్ నీ7 ఎఫ్ఎఫ్ 0009 ఇది కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా టెక్ కంపెనీ పేరిట రిజిస్టర్ అయింది. రేవంత్ కు కారు ఎందుకు కొనిచ్చారంటే వాళ్లు రియల్ ఎస్టేట్, ఇతర లావాదేవీలు చేస్తున్నారు.

**జడ్జిని ప్రలోభపెట్టాలని చూసిన కంపెనీ..**

2023 జులైలో కేఎల్ఎస్ఆర్, మరో కంపెని (ఏఎస్ ఎన్విటి)కి గొడవ జరగడంతో ఎన్‌సీఏటీని ఆశ్రయించారు. రేవంత్ రెడ్డికి ఉన్న బుద్ధులే ఈ కంపెనీకి ఉన్నాయి. ఔఅఒయ జడ్జి శరత్ కుమార్ తనకు ఫోన్లో మెస్సేజ్ వచ్చిందని, కేఎల్ఎస్ఆర్ కంపెనీకి మద్దతుగా తీర్పు ఇవ్వాలని మెస్సేజ్ రావడంతో ఒత్తిడి తట్టుకోలేక తప్పుకున్నారు. ఆ బినామీ కంపెనీకి రేవంత్ రెడ్డి అండ ఉంది. బనామీ కంపెనీ కేఎల్ఎస్ఆర్ కంపెనీ నుంచి సాయి మౌర్య డెవలపర్స్ లోకి డబ్బులు పెట్టి, భూములు కొని లాభాలు తెచ్చే పనిని భూపాల్ ఇన్ ఫ్రా చూసుకుంటుంది. 2018లోనే రేవంత్ రెడ్డికి బినామీ కంపెనీఅని ఐటీ కంపెనీ రైడ్స్ ద్వారా బయటకొచ్చింది. రేవంత్ సీఎం కాగానే కేఎల్ఎస్ఆర్ కంపెనీకి పెద్ద ఎత్తున ప్రాజెక్టులు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్, జల్ జీవన్ అమృత్ స్కీం కింద 6 వేల కోట్లకు పైగా ప్రాజెక్టులు వచ్చాయి. మెదక్ లో ఆర్ అండ్ బీకి 111 కోట్లు, షాద్ నగర్, పరిగి రోడ్డు 135 కోట్లు, సూర్యపేట మోతే లిఫ్ట్ ఇరిగేషన్ కు రూ.1910 కోట్లు, రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ కోదాడకు 300 కోట్లు, కొడంగల్ లో వెటర్నరీ కాలేజీకి రూ.145 కోట్లు, మిషన్ భగీరథలో 160 కోట్లు ఇలా దాదాపు 6 వేల కోట్లు కేఎల్ఎస్ఆర్ కంపెనీకి ప్రాజెక్టులు వచ్చాయి. అయితే 2023లో కంపెనీ దివాళా తీసింది. దానిపై పిటిషన్ సైతం ఎన్సీఎల్టీలో నడుస్తోంది. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేక అప్పులు తీసుకున్న కేఎల్ఎస్ఆర్ కంపెనీకి రూ.6వేల కోట్లు వచ్చాయంటే ఏ విధంగా నిధులు వచ్చాయో తెలుస్తుంది. ఆర్థిక లావాదేవిలు ఆపివేయాలని జనవరి 23న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. ఈ కంపెనీకి ఎందుకు ప్రాజెక్టులు ఇచ్చారని కోర్టు ప్రశ్నించినా కార్యకలాపాలు సాగిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలకు వరుసగా నోటీసులు ఇచ్చి విచారణ జరపడం వెనుక రేవంత్ రెడ్డి బినామా బాగోతం సుప్రీంకోర్టులో బయటపడటమే కారణమని' కేటీఆర్ అన్నారు.

# మంత్రులకు రేవంత్ టార్గెట్

**హైదరాబాద్ :** తెలంగాణలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన వ్యూహాలకు పదును పెట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. పార్టీ శ్రేణులను, మంత్రులకు కీలక సూచనలు చేశారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంత్రులతో భేటీ అయిన ముఖ్యమంత్రి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించి, పలు కీలక సూచనలు చేశారు. ఏ ఒక్క స్థానాన్ని కూడా వదులుకోకుండా క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.ఈ ఎన్నికల్లో మంత్రుల పాత్ర అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రులందరూ తమకు కేటాయించిన జిల్లాలకు తక్షణమే వెళ్లాలని, అక్కడ మున్సిపాలిటీల వారిగా క్షేత్రస్థాయి పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. ముఖ్యంగా వెనుకబడిన మున్సిపాలిటీలను ప్రత్యేకంగా గుర్తించి, అక్కడ పార్టీ పరిస్థితిని మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విశ్లేషణ చేయాలని సూచించారు.ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు మంత్రులు జిల్లాల్లోనే ఉంటూ, అక్కడ జరుగుతున్న పరిణామాలను, పార్టీ పురోగతిని వివరిస్తూ తనకు రోజువారీ నివేదిక అందజేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. దీని వల్ల ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించే అవకాశం ఉంటుందని ఆయన భావిస్తున్నారు.ఎన్నికల సమయంలో సహజంగానే టికెట్ల కోసం పోటీ ఎక్కువగా ఉంటుందని, ఈ క్రమంలో టికెట్ దక్కని నేతలను బుజ్జగించాలని సూచించారు. ఈ పని కూడా మంత్రులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. పార్టీ కోసం పని చేసే పాత నేతలకు , ఇటీవల పార్టీలో చేరిన కొత్త నేతలకు మధ్య ఎటువంటి



విభేదాలు రాకుండా సమన్వయం చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఒక్క ఓటు చీలిపోకుండా జాగ్రత్త పడాలని అని మంత్రులకు ఉద్బోధించారు. అందరూ సమిష్టిగా పని చేస్తేనే విజయం సాధ్యమని, ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల గెలుపు ఓటములకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జులే పూర్తి బాధ్యత వహించాలని సీఎం రేవంత్ రెడ్డి తేల్చారు. ప్రతి స్థానాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని, క్షేత్రస్థాయిలో అభ్యర్థుల గెలుపు కోసం శ్రమించాలని ఆదేశించారు. మంత్రులకు దిశానిర్దేశం చేయడమే కాకుండా స్వయంగా ప్రజల్లోకి వెళ్లేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారు. పలు అభివృద్ధి కార్యక్రమాలతోపాటు భారీ బహిరంగ సభల్లో పాల్గొంటారు. డిసెంబర్-5 కరీంనగర్ జిల్లా చొప్పదండిలో పర్యటన, బహిరంగ సభ ఉంటుంది. డిసెంబర్-6న నిజామాబాద్ జిల్లాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. డిసెంబర్-7 రంగారెడ్డి జిల్లాలోని పరిగి నియోజకవర్గంలో పర్యటిస్తారు. డిసెంబర్-8న వరంగల్ జిల్లా భూపాలపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. డిసెంబర్-9మెదక్ జిల్లా పర్యటనతో ప్రచారం ముగుస్తుంది. ఈ పర్యటనల ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా పర్యటనలు నిర్వహించడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ ప్రాంతాలను కవర్ చేసేలా ఈ షెడ్యూల్ రూపొందించారు.

## క్యాన్సర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి సుజాత





**జగిత్యాల :** క్యాన్సర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనిజిల్లా వైద్యాధికారి డాక్టర్ జి సుజాత అన్నారు.బుధవారంప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో క్యాన్సర్ మహమ్మారిపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ రోజుల్లో క్యాన్సర్ భూతానికి ఎంతో మంది బలవుతున్నారని ప్రజలందరూ క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని, ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ ను నిర్ధారించుకోవచ్చుని,. ప్రారంభ దశలో క్యాన్సర్ ను గుర్తించడం ద్వారా చికిత్స మెరుగుపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పోషకాహారం తీసుకుంటూ జీవనశైలి విధానంలో మార్పులు చేసుకుంటూ ఆరోగ్యపు అలవాట్లను పెంపొందించుకుంటూ ఉంటే క్యాన్సర్ రాకుండా నివారించుకోవచ్చని సూచించారు ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీల్ కుమార్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణమూర్తి, ఆర్ఎంఓ లు,డిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ ఎన్ శ్రీనివాస్, గైనకాలజిస్ట్ హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ అరుణ,మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రాజేందర్, డాక్టర్ నరేంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

## విద్యార్థుల ఉత్తమ ఫలితాల సాధనకై స్టడీ మెటీరియల్

### డీఎన్ఆర్ ఎడ్యూకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి

**జగిత్యాల :** ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్నా విద్యార్థిని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి మాట్రస్ట్ అందేజేస్తున్న స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని డీఎన్ఆర్ ఏడ్యూకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ప్రతాపరెడ్డి అన్నారు.జగిత్యాల పట్టణంలోని పిఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలికలు) లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థినుల విద్యాభివృద్ధి, ఉత్తీర్ణత సాధన లక్ష్యంగా డీఎన్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో "డీఎన్ఆర్ ? విజయపథం ఎస్సీస్సి స్టడీ మెటీరియల్"ను బుధవారం విద్యార్థినిలకు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ విలువైన విద్యా సామగ్రిని అందజేసిన డీఎన్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి కి పాఠశాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే దృఢ సంకల్పంతో ట్రస్ట్ చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని ఉపాధ్యాయులు అన్నారు.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించినసీనియర్ ఉపాధ్యాయులు జయశ్రీ ,రజిత,అబ్దుల్ రజాక్,దేవయ్య,ఉమా రాణి ,కమలాకర్ రెడ్డి,రాజేందర్,ఎల్ కుమార్, సత్యనారాయణ,పిడి రాధిక,మొహమ్మద్ అబ్దుల్ రజ్జాక్, పల్లె శ్రీనివాస రెడ్డి పాఠశాలలోని ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూఈ స్టడీ మెటీరియల్ ద్వారా విద్యార్థినులు విషయ పరిజ్ఞానం పెంపొందించుకొని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా డీఎన్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, హైదరాబాద్ వారూ భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఆకాంక్షినీచారు.

## మున్సిపల్ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలి

### రెండవ రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

### జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్

**జగిత్యాల :** మున్సిపల్ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఆదేశించారు.రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ రాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు.ఇందులో జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికల అధికారి బి. సత్యప్రసాద్ బుధవారం జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు సమక్షంలో రెండవ రాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలనే ఉద్దేశంతో ఈ రాండమైజేషన్ చేపట్టినట్లుగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను ఎలాంటి లోపాలు లేకుండా సమర్ధవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, జిల్లా నోడల్ అధికారి కె. రాము, కలెక్టరేట్ ఏవో హకిమ్, ఈడిఏం మమత మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాలకు సమాన అవకాశాలు అందాలి

### జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

### సోషల్ జస్టిస్ డే వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**జగిత్యాల :** సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటుందనిజిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సోషల్ జస్టిస్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూతెలంగాణ ప్రభుత్వం సమాజం లోని అన్ని వర్గాలకు న్యాయం జరిగేల పలు అభివృద్ధి,సంక్షేమ పథకాలు అమలు చేయడం తోపాటు ఫిబ్రవరి 4, నాడు సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.సోషల్ జస్టిస్ డే సందర్భంగా ప్రభుత్వం వివిధ సామాజిక వర్గాల అభివృద్ధికి అనేక రకాల సంక్షేమ పథకాలను అమలుపరుస్తుందని తెలిపారు.మహనీయులు, పెద్దలు సూచించిన విధంగా సమసమాజ స్థాపనకు అందరు కలిసి కట్టుగా కృషి చేయాలని తెలిపారు. సమాజంలో ప్రతిఒక్కరు రాజ్యాంగ పరంగా మరియు చట్ట పరంగా లభించే హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సామజిక న్యాయం ద్వారా సమానత్వం, సమాన అవకాశాలు, గౌరవ ప్రదమైన జీవనం సాధ్యమౌతాయని తెలిపారు.అనంతరం సోషల్ జస్టిస్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు.తదనంతరం వివిధ పోటిల్లో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమం లో విద్యార్థుల ప్రదర్శన, కళాజాత బృందం ప్రదర్శన అందరిని అలరించాయి.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, కలెక్టరేట్ సిబ్బంది పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్ లత, బి.రాజ గౌడ్, బి.సి వెల్ఫేర్ అధికారి జి. సునీత, మైనార్టీ అభివృద్ధి అధికారి చిత్రు,జిల్లా ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి అధికారి కె. రాజ్ కుమార్, జిల్లా విద్యాధికారి కె.రాము, వివిధ స్థాయిల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో హకీమ్,కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సైకత శిల్ప ప్రతిష్టారాధనకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

### ఆహ్వాన పత్రికను అందించిన నిర్వాహకులు ఉమారాణి

**జగిత్యాల :** కలియుగ వెంకటేశ్వర స్వామి 20 అడుగుల సైకత ఇసుక శిల్ప ప్రతిష్టారాధన కార్యక్రమానికి రావాల్సిందిగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్. ఎం. సంజయ్ కుమార్ ను నిర్వాహకులు ఉమారాణి ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈనెల 5 నుండి మార్చి 5 వరకు జగిత్యాల జిల్లా కేంద్రంలో ని ఎగ్జిభిషన్ గ్రౌండ్ లో నెలకొల్పే సైకత ఇసుక శిల్ప ఆరాధన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు వేముల ఉమారాణి తెలిపారు.కార్యక్రమ ప్రధాన ఆర్గనైజర్ వేముల ఉమారాణి బుధవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసి 3డి సైకత ఇసుక శిల్ప ప్రతిష్టారాధన కార్యక్రమానికి రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు.అలాగే ప్రముఖ వ్యాపారావేత్త, బీజేపీ నాయకులు కొండా లక్ష్మణ్ ఇంటికి వెళ్లిన ఉమారాణి, కొండ్ర రమాదేవి లు ఆహ్వానపత్రిక అందించి ప్రతిష్టారాధనకు రావాలని కోరారు.

## బిజినెస్

### తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరిగాయి ..!




తగ్గినట్లే తగ్గిన బంగారం, వెండి ధరలు మళ్లీ పెరిగాయి. యూఎస్ ఫెడ్‌కు కొత్త ఛైర్మన్ నియామకం, సీఎంఈ మార్జిన్‌ను పెంచడం, గరిష్ఠాల వద్ద భారీ ప్రాఫిట్ బుకింగ్ కారణంగా ఈ రెండు లోహాల ధరలు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. దీన్ని అవకాశంగా తీసుకుని మదుపర్లు దీర్ఘకాలిక వ్యూహంతో కొనుగోళ్లకు దిగడంతో వీటికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. దీంతో అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో బంగారం ఔన్సు 4,887 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి 85.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దీంతో దేశీయంగానూ ఈ రెండు లోహాల ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.1.56 లక్షల వద్ద కొనసాగుతుండగా.. కిలో వెండి ధర రూ.2.74 లక్షలు పలుకుతోంది. సోమవారం ధరలతో పోలిస్తే బంగారం దాదాపు రూ.6 వేలు పెరగ్గా.. వెండి రూ.20 వేలకు పైగా పెరిగింది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లోనూ 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.1.51 లక్షల వద్ద ట్రేడవుతుండగా.. కిలో వెండి రూ.2.60 లక్షల వద్ద కొనసాగుతోంది.

### జియో బ్లాక్‌రాక్ సంపద నిర్వహణ సేవలు

దేశీయ సంపద నిర్వహణ పరిశ్రమలో 20 కోట్ల మందికి సేవలు అందించే అవకాశం ఉందనే అంచనాతో, జియో బ్లాక్‌రాక్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ 'ప్రత్యేకించిన సూచనలు అందించడానికి' ఒక టెక్ ప్లాట్‌ఫామ్‌ను మంగళవారం ప్రారంభించింది. ఈ సేవల కోసం వినియోగదారులు ఏడాదికి రూ.350 ప్రారంభ ధర చెల్లించాల్సి ఉంటుంది. బ్లాక్‌రాక్ అలాడిన్ టెక్నాలజీతో నడిచే ఈ ప్లాట్‌ఫామ్, మ్యూచువల్ ఫండ్ ఎంపికలపై సలహాలు అందిస్తుంది. అంతర్జాతీయంగా 14 లక్షల కోట్ల డాలర్లకు పైగా ఆస్తులను నిర్వహిస్తూ, మన దేశంలో జియోతో కలిసి బ్లాక్‌రాక్.. పెట్టుబడి సలహా వేదికను తీసుకొచ్చింది. ఇందులో నమోదైన వినియోగదారుల రిస్క్ ప్రొఫైల్, పెట్టుబడి లక్ష్యాలను తెలుసుకుని, వారికి సలహాలను అందించడానికి ఈ ప్లాట్‌ఫామ్ ప్రయత్నిస్తుందని కంపెనీ తెలిపింది. రోజువారీ పర్యవేక్షణ ఉంటుందని పేర్కొంది. రూ.లక్ష విలువైన పర్యవేక్షణ ఆస్తులకు ఏడాదికి రూ.350 చెల్లించాలి. తదుపరి ఆస్తుల విలువలో 0.35% చొప్పున రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ప్రారంభంలో తొలి 3 నెలలు ప్లాట్‌ఫామ్‌ను ఉచితంగా వినియోగించుకోవచ్చని కంపెనీ ఎండీ, సీఈఓ మార్క్ పిల్గ్రిమ్ వెల్లడించారు.

# గూగుల్ కీలక నిర్ణయం..
# బెంగళూరులో భారీ క్యాంపస్



అమెరికా వర్క్ వీసాల హెచ్1బి నిబంధనలను మరింత కఠినతరం చేసిన విషయం తెలిసిందే. కొత్తగా హెచ్1బి వీసా తీసుకోవాలనుకునే ఉద్యోగులు, కంపెనీలు అక్షరాలా లక్ష డాలర్లు చెల్లించాల్సిందే. దీంతో విదేశీ ఉద్యోగులను నియమించుకోవడం అక్కడి కంపెనీలకు కత్తిమీద సాములా మారింది. ఈ నేపథ్యంలో టెక్ దిగ్గజమైన తన భవిష్యత్ వర్క్ ఫోర్స్ ను ఎక్కడ విస్తరించాలన్నదానిపై కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. వీసాల కోసం ఎదురుచూడకుండా.. భారత్ పై మరింత పెట్టుబడి పెట్టేందుకు గూగుల్ సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు 20 వేల మందికి పైగా ఉద్యోగులకు ఆ కంపెనీలో పనిచేసే అవకాశం లభిస్తుందని బ్లూమ్ బర్గ్ నివేదిక వెల్లడించింది. వైట్ ఫీల్డ్ లోని అలెంబిక్ సిటీ ఈ ప్రాజెక్టుకు కేంద్రంగా నిలవనుంది. బెంగళూరులో ఉన్న ప్రధాన ఐటీ కారిడార్లలో ఇది కూడా ఒకటి. గూగుల్ మాతృసంస్థ అయిన అల్ఫాబెట్ ఇప్పటికే అక్కడ ఒక ఆఫీస్ ను లీజుకు తీసుకోగా.. మరో రెండు టవర్లకు ఆప్షన్లు పొందింది. సుమారు 24 లక్షల చదరపు అడుగుల్లో మూడు టవర్లు ఉన్నాయి. బ్లూమ్ బర్గ్ నివేదిక ప్రకారం.. 6.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న టవర్.. కొద్ది నెలల్లోనే సంస్థ ఉద్యోగులకు అందుబాటులోకి రానుంది. మిగతా రెండు టవర్ల నిర్మాణం ఏడాది కాలంలో పూర్తయ్యే అవకాశం ఉంది. వీటిలో అల్ఫాబెట్ అధికారికంగా ఒక టవర్ కు సంబంధించిన లీజు గురించి మాత్రమే వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో సుమారు 14 వేల మంది గూగుల్ ఉద్యోగులు ఉండగా.. వైట్ ఫీల్డ్ క్యాంపస్ పూర్తిస్థాయిలో ప్రారంభమైతే.. గూగుల్ ఇండియా వర్క్ ఫోర్స్ మరింత రెట్టింపు కానుంది. దీనివల్ల గ్లోబల్ కార్యకలాపాల్లో భారత్ కు మరింత ప్రాధాన్యం పెరగుతుందని నిపుణులు చెప్తున్నారు. గత ఏడాది బెంగళూరులో గూగుల్ అతిపెద్ద క్యాంపస్‌ను ప్రారంభించింది. ఇందులో వినోద సదుపాయాలు, భారీ క్యాంటీన్లు ఉన్నాయి. అప్పటి నుంచి నియామకాలు వేగంగా జరుగుతున్నాయి. క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ లీడర్‌షిప్, మెషిన్ లెర్నింగ్, చిప్ డిజైన్, అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ వంటి విభాగాల్లో వందలాది ఉద్యోగాల కోసం గూగుల్ ప్రకటనలు జారీ చేసింది. కొన్ని పోస్టులకు పీహెచ్‌డీ అర్హతలు కూడా నిర్దేశించింది. యూట్యూబ్ కూడా జనరేటివ్ ఏఐ టూల్స్ అభివృద్ధి కోసం భారత్‌లో తన ఇంజినీరింగ్ టీమ్‌ను విస్తరిస్తోంది.

## వెనెజువెలా చమురుతో భారత్‌కు 3 బిలియన్ డాలర్లు ఆదా



అమెరికాతో ట్రేడ్ డీల్‌పై అంగీకారానికి వచ్చిన భారత్.. వెనెజువెలా నుంచి చమురు కొనుగోళ్లకు సిద్ధమైంది. ఈ నిర్ణయంతో మన దేశానికి ఏటా దాదాపు 3 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.27వేల కోట్లు) ఆదా కానుందట. ఈ మేరకు ఎస్‌బీఐ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది. భారత్ చమురు కొనుగోళ్లను రష్యా నుంచి వెనెజువెలాకు మళ్లిస్తే దిగుమతుల వ్యయం భారీగా తగ్గుతుందని ఈ నివేదిక పేర్కొంది. "వెనెజువెలా చమురు బ్యారెల్‌పై 10-12 డాలర్ల వరకు డిస్కౌంట్ లభిస్తే.. ఆ చమురును ఎంచుకోవడం భారత్‌కు లాభదాయకమే. రవాణా వ్యయం, ఇతర ఖర్చులన్నీ తీసేసినా ఏటా మన దేశానికి చమురు దిగుమతుల బిల్లు 3 బిలియన్ డాలర్ల మేర తగ్గుతుంది. ప్రస్తుతం చమురు ధరల డేటా ప్రకారం.. వెనెజువెలా ముడిచమురు బ్యారెల్ ధర దాదాపు 51 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది" అని ఎస్‌బీఐ రీసెర్చ్ తమ నివేదికలో తెలిపింది. భారత్ తమ ముడి చమురు కొనుగోళ్లను రష్యా నుంచి వెనెజువెలాకు మళ్లిస్తే.. ఖర్చు విషయంలో అనేక అంశాలను పరిగణించాల్సి ఉంటుంది. డిస్కౌంట్ ఎంత వస్తుంది.. రవాణా ఖర్చులు, సమయం, బీమా వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని మన వ్యయాలను లెక్కలేసుకోవాలి. భౌగోళికపరంగా వెనెజువెలా మనకు చాలా దూరంలో ఉంటుంది. అక్కడి నుంచి చమురు రవాణాకు పట్టే సమయం.. పశ్చిమాసియా దేశాలతో పోలిస్తే ఐదు రెట్లు ఎక్కువ. ఇక, రష్యా నుంచి వచ్చే సమయం కంటే రెట్టింపు. దీంతో వెనెజువెలా చమురుకు రవాణా వ్యయం అదనపు భారం అవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, రష్యా నుంచి డిస్కౌంట్ ధరకు చమురు సుదీర్ఘకాలం లభించే అవకాశం లేదనే వాదనలు కూడా ఉన్నాయి. ఉక్రెయిన్‌తో యుద్ధ పరిస్థితులు తగ్గుముఖం పడితే డిస్కౌంట్ ఆగిపోవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల వేళ వెనెజువెలా చమురు కొనుగోళ్లకు భారత్ మొగ్గుచూపడం ప్రాధాన్యం సంతరించుకుంది.

---

## స్పోర్ట్స్

# సౌతాఫ్రికాపై టీమిండియా గ్రాండ్ విక్టరీ



టీ20 ప్రపంచకప్-2026 సన్నాహకాల్లో భాగంగా నవీముంబై వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో టీమిండియా విక్టరీ సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో ఆరు వికెట్లు నష్టపోయి 240 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం ఛేదనలో సౌతాఫ్రికా ఏడు వికెట్లు కోల్పోయి 210 పరుగుల వద్దే నిలిచింది. సౌతాఫ్రికా బ్యాటర్లలో ఐడెన్ మార్‌క్రమ్ 38 పరుగులు, ర్యాన్ రెకెల్‌టెన్ 44 పరుగులు చేశారు భారత్ ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్ 20 బంతుల్లోనే రెండు ఫోర్లు, ఏడు సిక్సర్లు బాది 53 పరుగులు సాధించాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (18 బంతుల్లో 24) స్థాయికి తగ్గట్లు రాణించలేకపోయాడు. వీరిద్దరు ధనాధన్ దంచికొట్టి రిటైర్డ్ అవుట్‌గా వెనుదిరిగారు ఇక మూడో స్థానంలో వచ్చిన తిలక్ వర్మ 19 బంతుల్లోనే మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లు బాది 45 పరుగులు సాధించాడు. అయితే, ప్రొటీస్ పేసర్ మార్కో యాన్సెన్ బౌలింగ్‌లో బౌల్డ్ అయిన తిలక్ హాఫ్ సెంచరీ చేయకుండానే పెవిలియన్ చేరాడు. ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు నష్టపోయిన టీమిండియా 240 పరుగుల మేర భారీ స్కోరు సాధించింది. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో యాన్సెన్, కార్బిన్ బాష్, అన్రిచ్ నోర్జే, క్వెనా మఫాకా తలా ఒక వికెట్ పడగొట్టారు. కాగా భారత్- శ్రీలంక వేదికలుగా ఫిబ్రవరి 7 నుంచి టీ20 ప్రపంచకప్ మొదలుకానుంది. ఇందులో భాగంగా టీమిండియా తొలి రోజు పసికూన అమెరికాతో తలపడుతుంది. ఇదిలా ఉంటే.. టీ20 ప్రపంచకప్-2024 ఫైనల్లో సౌతాఫ్రికాను ఓడించి టీమిండియా జగజ్జేతగా అవతరించిన సంగతి తెలిసిందే.

### చరిత్ర సృష్టించిన భారత్.. ప్రపంచంలోనే తొలి జట్టుగా

భారత అండర్-19 క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఐసీసీ అండర్ వరల్డ్‌కప్ టోర్నమెంట్లో అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా నిలిచింది. ఏకంగా 310 పరుగులకు పైగా టార్గెట్‌ను పూర్తి.. ప్రపంచంలో ఈ ఘనత సాధించిన తొలి జట్టుగా రికార్డు సాధించింది. జింబాబ్వే వేదికగా జరుగుతున్న వరల్డ్‌కప్-2026 టోర్నీ రెండో సెమీ ఫైనల్లో భారత్.. అఫ్గనిస్తాన్‌తో తలపడింది. హరారేలో టాస్ గెలిచిన అఫ్గన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో కేవలం నాలుగు వికెట్లు నష్టపోయి ఏకంగా 310 పరుగులు సాధించింది. ఫైజల్ షినోజాదా (110), ఉజైరుల్లా నియాజాయ్ (101 నాటౌట్) శతకాల వల్ల ఈ మేర భారీ స్కోరు సాధ్యమైంది.

కొండంత లక్ష్యం

కొండంత లక్ష్యం ముందున్నా దూకుడుగా ఇన్నింగ్స్ మొదలుపెట్టిన యువ భారత్ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగింది. ఓపెనర్లలో ఆరోన్ జార్జ్ శతక్కొట్టగా (104 బంతుల్లో 115; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు).. వైభవ్ సూర్యవంశీ (33 బంతుల్లో 68) మెరుపు అర్ధ శతకం సాధించాడు. మూడో స్థానంలో బ్యాటింగ్ చేసిన కెప్టెన్ ఆయుశ్ మాత్రే కూడా హాఫ్ సెంచరీ (59 బంతుల్లో 62) సాధించాడు.

ఇదే అత్యధిక లక్ష్య ఛేదన

వీరికి తోడు విహాన్ మల్హోత్రా (47 బంతుల్లో 38), వేదాంత్ త్రివేది (6 బంతుల్లో 5) అజేయంగా నిలిచి భారత్ విజయాన్ని ఖరారు చేశారు. ఈ క్రమంలో కేవలం 41.1 ఓవర్లలోనే యువ భారత్ 311 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి వరల్డ్‌కప్ ఫైనల్లో అడుగుపెట్టింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ఆరోన్‌కు లభించింది. కాగా అండర్-19 వరల్డ్‌కప్ టోర్నీలో ఇదే అత్యధిక లక్ష్య ఛేదన. ఇంతకుముందు 2006లో న్యూజిలాండ్ ఐర్లాండ్ విధించిన 305 పరుగుల లక్ష్యాన్ని పూర్తి చేయగా.. 2022లో సౌతాఫ్రికా బంగ్లాదేశ్ ఇచ్చిన 294 పరుగుల టార్గెట్‌ను ఫినిష్ చేసింది. ఇదిలా ఉంటే.. ఇప్పటికి పదహారు ఎడిషన్లు పూర్తి కాగా.. భారత్ ఫైనల్ చేరడం ఇది పదోసారి కావడం విశేషం.



ఇంగ్లండ్ వర్సెస్ భారత్

మరో సెమీ ఫైనల్లో ఇంగ్లండ్ ఆస్ట్రేలియాను ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. బులవాయోలో మంగళవారం జరిగిన తొలి సెమీఫైనల్లో ఇంగ్లండ్ 27 పరుగుల తేడాతో ఆసీస్‌ను ఓడించి ఫైనల్లోకి దూసుకెళ్లింది. మొదట ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 277 పరుగులు చేసింది. ఇంగ్లండ్ కెప్టెన్ థామస్ ర్యూ (107 బంతుల్లో 110; 14 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించాడు. అనంతరం 278 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఆస్ట్రేలియా అండర్19 జట్టు 47.3 ఓవర్లలో 250 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. కెప్టెన్ ఒలివర్ పీక్ (88 బంతుల్లో 100; 10 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో రాణించినా ఫలితం లేకపోయింది. ఇక శుక్రవారం జరిగే వరల్డ్‌కప్ ఫైనల్లో భారత్- ఇంగ్లండ్ అమీతుమీ తేల్చుకుంటాయి.

### అరోన్ జార్జి సెంచరీ..
### ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్..
### ఆఫ్ఘన్‌పై ఘన విజయం



అండర్ 19 వరల్డ్ కప్‌లో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆఫ్ఘనిస్తాన్‌పై బుధవారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచులో భారత్ ఘన విజయం నమోదు చేసింది. అరోన్ జార్జి సెంచరీతో చెలరేగగా.. వైభవ్ సూర్యవంశీ దూకుడైన అర్ధసెంచరీతో భారీ విజయ లక్ష్యాన్ని ఇండియా సునాయాసంగా చేధించింది. హరారే వేదికగా జరిగిన మ్యాచులో మొదట ఆఫ్ఘనిస్తాన్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 50 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 310 పరుగులు చేసింది. ఆఫ్ఘన్ బ్యాటర్లలో ఇద్దరు సెంచరీలు సాధించారు. ఫైజల్ షినోజోదా 110 పరుగులు (93 బంతుల్లో 15 ఫోర్లు), ఉజైరుల్లా 101 పరుగులు, నాటౌట్ (86 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సర్లు)తో ఆకట్టుకున్నారు. తర్వాత ఉస్మాన్ సాదత్ 39 పరుగులు, ఖలీద్ అహ్మద్జాయ్ 31 పరుగులు సాధించారు. ఇండియన్ బౌలర్లలో కనిష్క్ చౌహాన్, దీపేశ్ చెరో రెండు వికెట్లు సాధించారు. అనంతరం 311 పరుగుల భారీ లక్ష్యంతో భారత్ బ్యాటింగ్ ఆరంభించింది. ఓపెనర్ అరోన్ జార్జ్ 115 పరుగులు (104 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లు)తో చెలరేగిపోయాడు. తర్వాత వైభవ్ సూర్యవంశీ 62 పరుగులు (33 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లు)తో విధ్వంసం సృష్టించాడు. ఆ తర్వాత కెప్టెన్ ఆయుష్ మాత్రే కూడా 62 పరుగులు (59 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లు)తో అదరగొట్టాడు. అలాగే విహాన్ మల్హోత్రా కూడా 38 పరుగులతో రాణించారు. భారత బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో 41.1 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ నెల 6, శుక్రవారం ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఇండియా, ఇంగ్లండ్ మధ్య ఈ తుదిపోరు ఉంటుంది.




# 'బుల్లెట్ సునీల్'గా రాజశేఖర్ రీ ఎంట్రీ 'బైకర్' గ్లింప్స్‌తో ఫ్యాన్స్‌లో జోష్

ఒకప్పుడు టాలీవుడ్‌లో యాక్షన్ హీరోగా, యాంగ్రీ స్టార్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజశేఖర్ కొంతకాలం విరామం తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఈసారి హీరోగా కాకుండా పవర్‌ఫుల్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. శర్వానంద్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'బైకర్' సినిమాలో రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై మంచి అంచనాలు తీసుకురాగా, తాజాగా మేకర్స్ రాజశేఖర్ పాత్రకు సంబంధించిన 'బుల్లెట్ సునీల్' గ్లింప్స్ విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో రాజశేఖర్‌ను ఓ మాజీ పవర్‌ఫుల్ బైక్ రేసర్‌గా చూపిస్తూ స్టైలిష్ లుక్, గంభీరమైన ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. కొన్నేళ్ల తర్వాత ఆయనను ఇంత ఎనర్జిటిక్‌గా, మాస్ షేడ్ ఉన్న పాత్రలో చూడబోతున్నామనే సంకేతాలు ఈ వీడియో ఇచ్చింది. గ్లింప్స్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. రాజశేఖర్ స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ మళ్లీ పాత రోజుల్ని గుర్తు చేస్తున్నాయని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. "ఇది రాజశేఖర్‌కు గ్యారెంటీ కంబ్యాక్ మూవీ అవుతుంది" అంటూ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఆయన కనిపించడమే సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. శర్వానంద్‌తో పాటు రాజశేఖర్ లాంటి సీనియర్ నటుడు కీలక పాత్రలో కనిపించడం సినిమాకు అదనపు బలం అవుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. యూత్‌కు దగ్గరైన బైక్ రేసింగ్ కథతో పాటు అనుభవజ్ఞులైన నటుల ప్రెజెన్స్ ఉండటంతో 'బైకర్' మూవీపై అంచనాలు క్రమంగా పెరుగుతున్నాయి. సెకండ్ ఇన్నింగ్స్‌లో రాజశేఖర్ ఎలాంటి పాత్రలు ఎంచుకుంటారన్న ఆసక్తి ప్రేక్షకుల్లో ఎప్పటినుంచో ఉంది. 'బుల్లెట్ సునీల్' గ్లింప్స్‌తో ఆయన మళ్లీ పవర్‌ఫుల్ పాత్రలతో అలరించబోతున్నారని సంకేతాలు రావడంతో, ఈ సినిమా ఆయన కెరీర్‌లో మరో మలుపు తిప్పే అవకాశం ఉందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రియల్ స్టోరీ మారెమ్మ.. టీజర్ రిలీజ్



మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు మాధవ్ భూపతిరాజు హీరోగా వస్తోన్న తాజా చిత్రం మారెమ్మ. ఈ సినిమాకు మంచాల నాగరాజు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ యధార్థ సంఘటనల ఆధారంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సినిమాలో దీపా బాలు హీరోయిన్‌గా కనిపించనున్నారు. తాజాగా విడుదలైన టీజర్ చూస్తుంటే గ్రామీణ నేపథ్యంలో సాగే రియల్ స్టోరీగా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఊరికి శాపం చుట్టుకోవడంతో గ్రామ దేవత మారెమ్మకు పూజలు చేయడం టీజర్‌లో చూపించారు. ఈ చిత్రాన్ని మోక్ష ఆర్ట్స్ పతాకంపై మయూర్ రెడ్డి బండారు నిర్మించారు. ఈ సినిమాలో వినోద్ కుమార్, వీఎస్ రూపా లక్ష్మి, దయానంద్ రెడ్డి కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీకి ప్రశాంత్ ఆర్.విహారి సంగీతమందిస్తున్నారు.

# మెగా 158 అప్‌డేట్: చిరంజీవి సినిమాలో 'ధురంధర్' హీరోయిన్

మన శంకర వర ప్రసాద్ సినిమాతో మెగాస్టార్ చిరంజీవి బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అనంతరం సమ్మర్‌లో అతడి విశ్వంభర చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా తర్వాత బాబీతో మెగా 158 సినిమా చేయబోతున్నాడు చిరు. ఈ ప్రాజెక్ట్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో చిరంజీవి కుమార్తెగా ఒక కీలక పాత్ర కోసం 'పొన్నియిన్ సెల్వన్' ఫేమ్, ధురంధర్ సినిమా సారా అర్జున్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ పాత్ర సినిమాలో అత్యంత కీలకం కానుందని తెలుస్తుంది. అయితే దీనిగురించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుంది. మరోవైపు చిరంజీవి కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన మూవీగా నిలిచిపోతుందని మెగా అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా కన్నడ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది.



# 'అమరన్' దర్శకుడితో ధనుష్.. కీలక పాత్రలో మమ్ముట్టి

తమిళ స్టార్ హీరో ధనుష్ తన 55వ సినిమాను (డి55) 'అమరన్' దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్ నుంచి ఒక అదిరిపోయే అప్‌డేట్ వెలుబడింది. ఈ చిత్రంలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ఒక కీలక పాత్ర పోషిస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ధనుష్ మరియు మమ్ముట్టి పూర్తిస్థాయిలో కలిసి నటిస్తున్న మొదటి సినిమా కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. మరోవైపు దాదాపు ఏడేళ్ల (2019లో వచ్చిన 'పేరంబు') తర్వాత మమ్ముట్టి తమిళ సినిమాలో నటిస్తుండటం విశేషం. ఈ సినిమాలో ధనుష్ సరసన సాయి పల్లవి మరియు శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'అమరన్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రాజ్‌కుమార్ పెరియసామి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా.. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ధనుష్ స్వయంగా తన వండర్‌బార్ ఫిలింస్ బ్యానర్‌పై ఆర్‌టేక్ స్టూడియోస్‌తో కలిసి ఈ భారీ యాక్షన్ డ్రామాను నిర్మిస్తున్నాడు.






# మెగా ఫ్యాన్స్‌కు షాక్.. పెద్ది మూవీ రిలీజ్ వాయిదా

రామ్ చరణ్ హీరోగా వస్తోన్న రూరల్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది. ఈ సినిమా కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు మేకర్స్. ఈ ఏడాది మార్చి 27న రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు. కానీ తాజాగా అభిమానులకు బిగ్ షాకిచ్చింది మూవీ టీమ్. పెద్ది విడుదలను వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. పెద్ది మూవీ కొత్త రిలీజ్ డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. దాదాపు నెల రోజుల పాటు ఈ సినిమాను వాయిదా వేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నట్లు పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. దీంతో మార్చిలో పెద్ది చూడాలనుకున్న మెగా ఫ్యాన్స్ తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ సినిమాకు బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

**దురంధర్-2 వల్లేనా?**

అయితే పెద్ది మూవీ వాయిదా వేయడంపై నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. రణ్‌వీర్ సింగ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ సీక్వెల్ దురంధర్-2 మార్చి 19న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ సారి దక్షిణాది భాషల్లోనూ ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పెద్దిని వాయిదా వేసి ఉంటారని నెటిజన్స్ భావిస్తున్నారు. ఇప్పటికే అడివి శేష్ నటించిన డకాయిట్ సైతం వాయిదా పడిన సంగతి తెలిసిందే.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com